SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS Traditional Cure For Toughest Diseases
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్



D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక

వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : గురువారం 10 సెప్టెంబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 203

# కిసాన్ రైలుతో ఎంతో ప్రయోజనం: జగన్



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** 'కిసాన్ రైలు' వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అయితే, కిసాన్ రైలు ఛార్జీల విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరారు. ఛార్జీలు తగ్గిస్తే మరింత ఉపయోగకరమని అన్నారు. అనంతపురం-దిల్లీ మధ్య 'కిసాన్ రైలు' సర్వీసును వీడియో లింక్ ద్వారా సీఎం జగన్, కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.."వ్యవసాయ ఉత్పత్తుల్లో ఏపీ అగ్రగామిగా ఉన్నప్పటికీ.. కొవిడ్ వ్యాప్తి కారణంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయ డానికి ఇబ్బందులు ఎదుర్కొన్నాం. రాష్ట్రంలో రైతులు పండించే మొత్తం పంటలో.. రాష్ట్రమంతా కలిపి 10 నుంచి 15 శాతం వినియోగమే ఉంటుంది. దక్షిణ భారత్‌కు ఏపీ పండ్ల ఉత్పత్తి కేంద్రంగా ఉంది. అయితే కొవిడ్ సమయంలో రవాణా సౌకర్యం లేక మిగిలిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి కష్టంగా మారింది. 'కిసాన్ రైలు' లాంటి ప్రత్యామ్నాయాలు.. రైతులకు మరింత అండగా ఉండేలా, గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకునేందుకు ఉపకరిస్తాయి" అని సీఎం అభిప్రాయపడ్డారు.

**అనంత రైతులకు ఎంతో ప్రయోజనం: నరేంద్రసింగ్ తోమర్**

దేశంలో రెండో కిసాన్ రైలు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ అన్నారు. ఈ రైలు ద్వారా దిల్లీకి నేరుగా వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చన్నారు. కిసాన్ రైలు వల్ల అనంతపురం జిల్లా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తులను పలు రాష్ట్రాల మార్కెట్లకు ఎగుమతికి అవకాశం ఉంటుందని చెప్పారు. అదేవిధంగా కిసాన్ రైలు ద్వారా రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, యూపీ, హరియాణా మీదుగా కిసాన్ రైలు రైలు దిల్లీ వెళ్తుందని వివరించారు. ఈ క్రమంలో మార్గ మధ్యలో రాష్ట్రాల రైతులకు 'కిసాన్ రైలు' వల్ల ప్రయోజనముంటుందని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేందుకు కేంద్రం ఈ చర్యలు చేపట్టిందని నరేంద్ర సింగ్ తోమర్ స్పష్టం చేశారు.

**మరో నాలుగు కులాలకు వైఎస్సార్ చేయూత**

బుడగ జంగం, వాల్మీకి, ఏనేటి కొండ్, బెంతొ ఒరియా కులాల వారికి కులధ్రువీకరణ పత్రం అవసరం లేకుండానే వైఎస్సార్ చేయూత పథకం వర్తింపు జేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నాలుగు కులాల వారు వివిధ కారణాలతో కులధ్రువీకరణ పత్రం పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కులధ్రువీకరణ పత్రం లేకపోవడం వల్ల ఆయా కులాల్లో పలువురు అర్హత ఉండి కూడా పథకం కింద లబ్ధి పొందలేకపోయారని పలువురు మంత్రులు ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సీఎం కార్యాలయ ఆదేశాల మేరకు స్వయం కులధ్రువీకరణ పత్రంతోనే అర్హులకు వైఎస్సార్ చేయూత పథకాన్ని అందించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజికవర్గాల్లో 45-60 ఏళ్ల మధ్య ఉండే మహిళలకు నాలుగు విడతల్లో రూ.75 వేలు చెల్లించే వైఎస్సార్ చేయూత పథకాన్ని గత నెల 12న ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పథకానికి ఈ నాలుగు కులాల వారిలో అర్హులను గుర్తించే ప్రక్రియను మొదలుపెట్టినట్టు సెర్ప్ సీఈవో రాజాబాబు తెలిపారు.

# 'రథాన్ని తగలబెట్టిన వారిని వదిలి పెట్టేది లేదు'



**తాడేపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** అంతర్వేది రథం కాల్చివేత చాలా బాధాకరమని దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి పోలీసులు విచారణ జరుపుతున్నారని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. రథం కాల్చివేత జరిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డీజీపీని ఆదేశించారని వెల్లడించారు. 95 లక్షల రూపాయలతో కొత్త రథాన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు కులాలను మతాలను రెచ్చగొడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రథాన్ని తగలబెట్టిన వారిని వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ముసుగులో కొంత మంది విద్రోహులు చర్చ్‌పై రాళ్లు రువ్వారని మంత్రి వెల్లంపల్లి అన్నారు. చర్చ్, మసీదు, గుళ్లపై దాడులు చేసే వారిని క్షమించమని హెచ్చరించారు. ఇంకా విచారణ జరుగుతుండగానే ఈ విషయంపై కొంత మంది రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. పుష్కరాల సందర్భంగా 40 దేవాలయాలను చంద్రబాబు కూల్చివేశారని, ఈ కూల్చివేతలో బీజేపీ జనసేనకు భాగస్వామ్యం లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు కూల్చివేసిన దేవాలయాలను నిర్మించాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. దాడులు చేసే సంస్కృతి చంద్రబాబుదని, హైదరాబాద్‌లో కూర్చొని జూమ్‌లో చంద్రబాబు సలహాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. 'సోము వీర్రాజును హౌస్ అరెస్ట్ చేయలేదు. అంతర్వేది ఆలయ ఈవోని సస్పెండ్ చేశాము. అంతర్వేది సంఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తాం. హిందూ దేవాలయాల్లో ఇతర మతస్తులను మా ప్రభుత్వం వచ్చాక తొలగించామం. మతాలు మధ్య చిచ్చు పెట్టాలని చంద్రబాబు చూస్తున్నారు. చంద్రబాబు దెయ్యం మాదిరిగా వ్యవహరిస్తున్నారు. శ్రీశైలం దేవస్థానంలో జరిగిన అవకతవకలుపై 30 మంది అధికారులను తొలగించాము.

**పనికిమాలిన ఎంపీ రఘురామ కృష్ణమరాజు.. ఢిల్లీలో కూర్చొని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు.**

సోము వీర్రాజు మాటలను ఖండిస్తున్నాము. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మొద్దు. పవన్ కల్యాణ్ లాగా ఓట్లు కోసం రాజకీయాలు చేయడం మాకు తెలియదు. ఎన్నికలకు ముందు పవన్ కళ్యాణ్ తన పిల్లలు క్రిస్టిన్ అన్నారు. ఎన్నికలు తరువాత హిందువులు అంటున్నారు. అందుకే పవన్ కల్యాణ్ రెండు చోట్ల ఓడించారు. గత ప్రభుత్వం హయాంలో అంతర్వేది దేవాలయ భూముల అన్యాక్రాంతం చేయాలని చంద్రబాబు చూశారు. టీటీడీ నిధులు ఎక్కడ దారి మళ్లించారో సోము వీర్రాజు సమాదానం చెప్పాలి. చంద్రబాబు షూటింగ్ కోసం 29 మందిని చంపేశారు. పుష్కరాల పేరుతో వందల కోట్లు దోచేశారు. చంద్రబాబు పాపాల్లో బీజేపీ జనసేనకు భాగస్వామ్యం లేదా.' అని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మతాలు, కులాలు ముఖ్యమంత్రికి సమానమేనని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 'జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంకు మతాలతో సంబంధం లేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా అధికారంలో లేనప్పుడు ఒక విధంగా మాట్లాడుతున్నారు. 40 దేవాలయాలను కూల్చివేసిన చంద్రబాబు ఎందుకు నిజానిర్ధారణ కమిటీ వేయలేదు. ప్రభుత్వంకు కులాలు మతాలు అంటగట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులపై కొంత మంది దాడి చేయాలని చూడడం దుర్మార్గం.' అని పేర్కొన్నారు.

## లాక్‌డౌన్‌తో వారిపై కోలుకోలేని దెబ్బ: రాహుల్



**దిల్లీ:** ఎలాంటి సమాచారం లేకుండా కేంద్రం తీసుకున్న లాక్‌డౌన్ నిర్ణయం వల్ల అసంఘటిత రంగం కోలుకోలేని విధంగా దెబ్బతిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. లాక్‌డౌన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. ప్రధాని మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ బుధవారం ఆయన ట్విటర్‌లో వీడియో పోస్ట్ చేశారు. 'కరోనా వైరస్‌కు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆకస్మికంగా తీసుకున్న లాక్‌డౌన్ నిర్ణయంతో అసంఘటిత రంగంపై కోలుకోలేని దెబ్బ పడింది. లాక్‌డౌన్ కరోనాపై చేసిన దాడిని అటుంచితే.. పేదలపై పడిన భారమే ఎక్కువ ఉంది. దినసరి కూలీలు, వలస కార్మికులు, చిన్న మధ్య తరహా వ్యాపారులు ఎంతో నష్టపోయారు. ఆ నిర్ణయం దాదాపు 97లక్షల మంది వలస కార్మికులను ఇంటి బాట పట్టించింది. వారందరికీ రోజూ పనిచేస్తేనే పూట గడవడం కష్టం. కాబట్టి వారికి కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, లాక్‌డౌన్ ఇవన్నీ భారత ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయి. అదేవిధంగా కరోనాను ఎదుర్కోవడంలో కేంద్రం పనితీరు సరిగా లేనందుకే కేసుల్లో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానానికి ఎగబాకింది' అని ఘాటు విమర్శలు చేశారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి: మోదీ



భోపాల్: తాగునీటి కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. పీఎం ఆత్మనిర్భర్ నిధి కింద లబ్ధి పొందుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన వీధి వ్యాపారులతో ఆయన బుధవారం వీడియోకాల్ ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా మోదీ వారికి పలు సూచనలు చేశారు. తాగునీటి కోసం అందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పి మట్టి కుండల వైపు మొగ్గు చూపాలని సూచించారు. చగన్‌లాల్ అనే చీపుర్ల తయారీ వ్యాపారితో మాట్లాడుతూ.. వారి కుటుంబానికి ఉజ్వల్ యోజన పథకం ఎలా లబ్ధి చేకూర్చిందని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వ్యాపారాన్ని ఎలా వృద్ధి చేసుకోవాలో సూచనలు చేశారు. గ్వాలియర్‌కు చెందిన మహిళకు ఆయుష్మాన్ పథకం ప్రాధాన్యం తెలిపారు. కూరగాయల వ్యాపారులు లావాదేవీల కోసం డిజిటల్ సాంకేతికతను ఉపయోగించడంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. అ పద్ధతిని వారు అలాగే కొనసాగించాలని ప్రోత్సహించారు.

## పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

## 12 నుంచి 24 ప్రత్యేక రైళ్లు

**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 9 :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో ఈ నెల 12 నుంచి రైళ్లను పెంచనున్నారు. కోవిడ్-19 కారణంగా ఇప్పటి వరకు 14 ప్రత్యేక రైళ్లను మాత్రమే నడిపిన రైల్వేశాఖ.. ఇక నుంచి 24 రైళ్లకు పెంచాలని నిర్ణయించింది. రైళ్లలో రాకపోకలకు ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆక్యుపెన్సీ 70 నుంచి 80శాతం ఉంటోందని రైల్వే అధికారులు చెబుతున్నారు. డివిజన్ పరిధిలోని ఒక్కో జిల్లాలో ఒకొక్క స్టేషన్లో మాత్రమే రైలు ఆగుతుంది. అనకాపల్లి, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ప్రకాశం (ఒంగోలు), నెల్లూరు స్టేషన్లలో ఆగుతుంది. షెడ్యూల్ రైళ్లకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. గతంలోలా ఈ 24ను ప్రత్యేక రైళ్లగానే నడుపుతారు.



ముందుగానే రిజర్వేషన్లు ఇస్తారు. రైలులో ఎక్కేందుకు గంట ముందుగానే రావాల్సి ఉంటుంది. కరోనా పరీక్షలు చేసిన తరువాతనే రైలులోకి అనుమతిస్తారు. బోగీలు శానిటైజేషన్ తరువాతనే ప్రయాణీకుల్ని అనుమతిస్తున్నారు. మాస్కులు, శానిటైజర్లు తప్పని సరిగా వాడాలనే నిబంధన పెట్టారు.

**12వ తేదీ నుంచి నడిచే 24 రైళ్లు ఇవే.....**

ఎంజీఆర్ మద్రాస్ సెంట్రల్ చాప్రా (02669), ఎంజీఆర్ మద్రాస్ సెంట్రల్-న్యూఢిల్లీ(02615), హౌరా-సికింద్రాబాద్ (02703), విశాఖపట్నం-న్యూఢిల్లీ (02805), హౌరా-యశ్వంత్‌పూర్ (02245), భువనేశ్వర్-ముంబై(01020), తిరుచ్చిరాపాలి -హౌరా (02664), దానాపూర్-కెఎస్ఆర్ బెంగళూరు (02296), చాప్రా-ఎంజీఆర్ మద్రాస్ సెంట్రల్ (02670), గుంటూరు- సికింద్రాబాద్ (07201), హౌరా-తిరుచ్చిరాపాలి (02663), ఎంజీఆర్ మద్రాస్ సెంట్రల్- న్యూఢిల్లీ (02433), బెంగళూరు కంటోన్మెంట్-గౌహతి (02509), ముంబై-భువనేశ్వర్(01019), న్యూఢిల్లీ-ఎంజీఆర్ మద్రాస్ సెంట్రల్ (02434), సికింద్రాబాద్-గుంటూరు (07202), గౌహతి-బెంగళూరు కంటోన్మెంట్ (02510), సికింద్రాబాద్-హౌరా (02704), కెఎస్ఆర్ బెంగళూరు-దానాపూర్ (02295), యశ్వంత్‌పూర్-హౌరా (02246), న్యూఢిల్లీ-విశాఖపట్టణం (02806), హైదరాబాద్- విశాఖపట్టణం (02728), న్యూఢిల్లీ -ఎంజీఆర్ మద్రాస్ సెంట్రల్ (02616), విశాఖపట్నం- హైదరాబాద్ (02727).

## విలేకరులు కావలెను

'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం, విశాఖ పశ్చిమం, తూర్పు, పాడేరు, అరకు ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా జిల్లా ఇన్‌చార్జ్‌లుగా కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

7032034001, 8500159006

# పోలీసుల వలయంలో అంతర్వేది



**అంతర్వేది:** తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య రథం దగ్ధమైన ఘటన నేపథ్యంలో ఇంకా ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది. ఇవాళ చలో అంతర్వేదికి భాజపా, జనసేన పిలుపునిచ్చాయి. దీంతో కోనసీమ వ్యాప్తంగా భాజపా, జనసేన నేతలను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. 30 పోలీసు యాక్టు అమలు కారణంగా అంతర్వేదిలో పర్యటించేందుకు నాయకులకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. కొత్తపేటలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరు సత్యానందం, రావులపాలెంలో భాజపా గుంటూరుజిల్లా పదాధిపతి రామకృష్ణారెడ్డిలను గృహనిర్బంధం చేశారు. నిన్న చలో అంతర్వేది కార్యక్రమంలో పాల్గొన్న 43 మంది నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అంతర్వేదిలో పోలీసులు భారీగా మోహరించారు. ఇతర ప్రాంతాల వారు అంతర్వేదిలో అడుగు పెట్టకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఇతరులు రావొద్దు: ఏలూరు రేంజ్ డీఐజీ**

అంతర్వేది పరిసర ప్రాంతాల్లో 30 పోలీసు యాక్టు అమల్లో ఉందని, ఆ ప్రాంతానికి ఇతరులు రావొద్దని ఏలూరు రేంజ్ డీఐజీ తెలిపారు. అంతర్వేది అగ్నిప్రమాద ఘటనా స్థలి వద్ద క్యాంపు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని వెల్లడించారు. ఫోరెన్సిక్ విభాగానికి చెందిన నిపుణులు ఘటనా స్థలంలో అణువణువు నిశితంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ సంయమనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో 'వార్తావళి' తెలుగు దినపత్రిక యూ ట్యూబ్ చానల్ ప్రారంభమవుతుంది.
ఎపిలో వివిధ జిల్లాల్లో, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావెలెను.
యూ ట్యూబ్ చానల్‌లో పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను.
bulusu555@gmail.com
మెయిల్‌కి తమ బయోడాటా పంపించగలరు.
YouTube

## ప్లాస్మా థెరపీతో లాభం లేదు!

### ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి



**దిల్లీ:** కొవిడ్-19 మరణాల రేటును తగ్గించడంలో ప్లాస్మా థెరపీ పెద్దగా ఉపయోగపడడం లేదని భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) అధ్యయనంలో తేలింది. కొవిడ్-19 తీవ్రరూపం దాల్చకుండా అడ్డుకోవడంలోనూ ఈ చికిత్సా విధానం ప్రయోజనం చూపడం లేదని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 29 కొవిడ్ చికిత్సా కేంద్రాల్లో 464 మందిపై అధ్యయనం జరిపిన అనంతరం ఈ విషయాలు వెల్లడించింది. ఏప్రిల్ 22 నుంచి జులై 14 మధ్య ఈ పరిశోధన చేపట్టినట్లు తెలిపింది. కొవిడ్ కట్టడి చర్యల్ని పర్యవేక్షించేందుకు ఐసీఎంఆర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యదళం ఈ అధ్యయనాన్ని ధ్రువపరిచింది. ఈ చికిత్సా విధానంలో అనేక మినహాయింపులు ఉన్నాయని అధ్యయనం పేర్కొంది. పరిమిత వసతులుండే సాధారణ ప్రయోగశాలల్లో ఈ థెరపీని చేపట్టడం సాధ్యం కాదని తెలిపింది. చికిత్సకు ముందు దాత, రోగిలో యాంటీబాడీల సంఖ్యను లెక్కించడం వల్ల ఈ థెరపీ ప్రయోజనంపై స్పష్టత లభించే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. ఈ అధ్యయనంలో మొత్తం 464 మంది మోతాదు స్థాయిలో కొవిడ్ లక్షణాలున్నవారు పాల్గొన్నారు. వీరిలో 235 మందికి ప్రామాణిక చికిత్సా విధానం(బీఎస్సీ)తో పాటు ప్లాస్మా థెరపీ అందించారు. మరో 229 మందికి కేవలం బీఎస్సీని కొనసాగించారు. 28 రోజుల పర్యవేక్షణలో రెండు వర్గాల మరణాల రేటులోగానీ, తక్కువ లక్షణాలున్నవారు విషమ పరిస్థితుల్లోకి వెళ్లడంలోగానీ పెద్దగా తేడా కనిపించలేదని అధ్యయనంలో తేలింది. దీని ఆధారంగా ప్లాస్మా చికిత్స వల్ల పెద్దగా ప్రయోజనం లేదన్న నిర్ణయానికి వచ్చినట్లు ఐసీఎంఆర్ ప్రకటించింది. అయితే, ఈ చికిత్స విధానానికి దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం లభించింది. కొవిడ్ కట్టడి కోసం జూన్ 27న కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన మార్గదర్శకాల్లో.. మోతాదు స్థాయి లక్షణాలున్న వారికి ప్రయోగాత్మక చికిత్సలో భాగంగా ప్లాస్మా థెరపీ అందజేయొచ్చని తెలిపింది.

## ఆ వేటగాళ్లు మా వద్దే ఉన్నారు

### అయిదుగురు యువకుల ఆచూకీ వెల్లడించిన చైనా



**దిల్లీ:** భారత్-చైనా సరిహద్దులోని అడవుల్లో వేటకు వెళ్లి అపహరణకు గురయ్యారని భావిస్తున్న అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన అయిదుగురు యువకుల జాడ తెలిసింది. వారందరూ తమ వద్దే ఉన్నట్టు ఎట్టకేలకు చైనా ఆర్మీ అంగీకరించింది. అడవిలో తప్పిపోయిన వారందరూ తమ భూభాగంలో కనిపించారని వెల్లడించింది. భారత సైన్యానికి అందించిన సమాచారంలో చైనా ఆర్మీ ఈ విషయాన్ని స్పష్టం చేసినట్టు కేంద్ర సహాయ మంత్రి, అరుణాచల్‌ప్రదేశ్ ఎంపీ కిరణ్ రిజిజు మంగళవారం ట్వీట్ ద్వారా వెల్లడించారు. ఆ అయిదుగురిని వెనక్కి తీసుకొచ్చే విషయంపై చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. మంగళవారం తెల్లవారు ఝామున 4.30 గంటల సమయంలో హాట్‌లైన్ ద్వారా భారత సైనికులకు ఆ వేటగాళ్ల సమాచారాన్ని చైనా ఆర్మీ తెలిపినట్లు సమాచారం. సోమవారం అయిదుగురు వేటగాళ్ల సమాచారాన్ని తెలిపేందుకు చైనా నిరాకరించిన విషయం తెలిసిందే. అప్పర్ సుబాన్‌సిరి జిల్లా నాచో ప్రాంతం నుంచి వేటకు వెళ్లిన ఆ అయిదుగురిని గురువారం మెక్‌మోహన్ రేఖ వద్ద చైనా సైన్యం అపహరించిందని...ఈ ఘటన నుంచి తప్పించుకొని వచ్చిన ఇద్దరు యువకులు వెల్లడించారు. మెక్‌మోహన్ రేఖ వద్ద సరిహద్దుపై స్పష్టత లేకపోవటం, ఆ ప్రాంతమంతా దట్టమైన అటవీ ప్రాంతం కావటంతో రెండు వైపులనున్న స్థానిక తెగల ప్రజలు తరచూ ఇరు దేశాల భూభాగాల్లోకి వెళ్తుంటారని, దీనిని అంత తీవ్రంగా భావించాల్సిన అవసరం లేదని సైనిక వర్గాలు తెలిపాయి.

## చట్ట సభల్లో ఈసారి పేపర్ బ్యాలెట్లే!



**దిల్లీ:** రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చట్టాల రూపకల్పనలో ఇప్పటికంటే కొంత ఎక్కువ సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. బిల్లులపై ఓటింగ్ కోసం ఎలక్ట్రానింగ్ ఓటింగ్ వ్యవస్థ బదులు పేపర్ బ్యాలెట్‌లను ఉపయోగించడమే ఇందుకు కారణం. ఈ నెల 14 నుంచి అక్టోబర్ 1 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. కరోనా వ్యాప్తి నేపథ్యంలో వారాంతపు సెలవులూ లేకుండా ఉభయ సభలు నిర్వహించాడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వైరస్ ఉద్ధృతి దృష్ట్యా వివిధ బిల్లులపై సభ్యులు ఓటు వేసేందుకు ఈసారి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగించడం లేదు. ఈ మేరకు పార్లమెంట్ కార్యదర్శి ప్రకటన విడుదల చేశారు. గతంలో బిల్లులపై ఓటింగ్ కోసం బ్యాలెట్ పద్ధతినే అమలు చేసే వారు. కానీ, దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాలు అందుబాటులోకి తేవడంతో చట్ట సభల్లోనూ ఇదే పద్ధతిని అవలంభిస్తున్నారు. ఓటింగ్ సమయంలో యంత్రంలో లోపాలు తలెత్తినా, సభ్యులు పొరపాటున వ్యతిరేక ఓటు వేసినా, వాళ్లకు బ్యాలెట్‌ను అందించేవారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వల్ల ఫలితం తేలేందుకు 5 నిమిషాలు పడితే.. బ్యాలెట్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు దాదాపు 20 నిమిషాలు పడుతుందని అధికారులు చెబుతున్నారు. తాజా సమావేశాల్లో మూడు వ్యవసాయ సంస్కరణలకు సంబంధించిన ఆర్డినెన్స్‌లతోపాటు మొత్తం 11 ఆర్డినెన్స్‌లకు కేంద్రం ఆమోదం తెలపనుంది. అంతేకాకుండా పెండింగ్‌లో ఉన్న మరికొన్ని బిల్లులకు కూడా ఆమోద ముద్ర వేయనుంది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో సభ్యులంతా సామాజిక దూరం పాటించాలని పార్లమెంట్ కార్యదర్శి ప్రకటన జారీ చేశారు. దీనికి అనుగుణంగా ఉభయసభల్లోనూ ప్రత్యేకంగా సీట్లను ఏర్పాటు చేశారు. ఎవరికి కేటాయించి స్థానాల్లో వారే కూర్చోవాల్సి ఉంటుంది.

## ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ ప్రయోగాలకు తాత్కాలిక బ్రేక్!

**న్యూయార్క్:** కొవిడ్ వ్యాక్సిన్ రేసులో ముందంజలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ టీకా ప్రయోగాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. బ్రిటన్‌లో ఈ టీకా వేయించుకున్న ఓ వాలంటీరుకు అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు సమాచారం. దీంతో తుది దశకు చేరుకున్న క్లినికల్ ట్రయల్స్‌ను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు ఆస్ట్రాజెనెకా వెల్లడించింది. ప్రయోగ ప్రామాణిక ప్రక్రియ ప్రకారం వ్యాక్సిన్ భద్రతపై మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఆస్ట్రాజెనెకా ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, ఆ వాలంటీర్‌కు తలెత్తిన అనారోగ్య సమస్యలేంటో మాత్రం వెల్లడించలేదు. అయితే, వ్యాక్సిన్ అభివృద్ధిలో ఇలాంటి సమస్యలు తలెత్తడం సాధారణ విషయమేనని ఆస్ట్రాజెనెకా అధికార ప్రతినిధి తెలిపారు. ఇలా జరిగినప్పుడు మరోసారి లోతైన సమీక్ష నిర్వహించి.. తిరిగి ప్రయోగాల్ని కొనసాగిస్తుంటామన్నారు. ఇది సర్వసాధారణమైన విషయమేనని పేర్కొన్నారు. ట్రయల్స్‌లో ఎలాంటి లోపాలు ఉండొద్దనే ఉద్దేశంతోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని వివరించారు. ఇంత భారీ స్థాయిలో ట్రయల్స్ నిర్వహిస్తున్నప్పుడు ఒకరిద్దరిలో దుష్ప్రభావాలు తలెత్తడం సాధారణంగా జరుగుతుంటుందన్నారు. తాజాగా తలెత్తిన సమస్యపై వీలైనంత త్వరగా సమీక్ష నిర్వహించి వ్యాక్సిన్ ప్రయోగాల్ని పునఃప్రారంభిస్తామన్నారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు, శాస్త్రవేత్తలు స్పందించారు. జ్వరం, జలుబు వంటి సాధారణ సమస్యలు కాకుండా ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరం ఏర్పడి ఉంటుందని వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన డెబోరా ఫుల్లర్ అనే ప్రముఖ పరిశోధకుడు అభిప్రాయపడ్డారు. ఈయన కూడా మరో పద్ధతిలో కొవిడ్ వ్యాక్సిన్‌పై ప్రయోగాలు జరుపుతున్నారు. అయితే, దీనిపై పెద్దగా విచారించాల్సిన అవసరం ఏం లేదన్నారు. అసలు టీకా తీసుకున్న వారి శరీరం ఎలా స్పందిస్తోంది.. వారి ఆరోగ్యం ఎలా ఉంటోంది.. వంటి



అంశాలపై మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు ఇలా తాత్కాలికంగా నిలిపివేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన మరో పరిశోధకుడు ఏంజిలా రస్‌ముస్సేన్ స్పందిస్తూ.. వ్యాక్సిన్ వల్ల తలెత్తిన అనారోగ్యం అయి ఉండదని అంచనా వేశారు. ఏదేమైనా ఇలాంటి సమస్యల్ని ముందుగా గుర్తించడానికే క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తారని తెలిపారు. చివరి దశలో భాగంగా భారీ సంఖ్యలో వాలంటీర్లకు టీకా అందజేస్తారు. తద్వారా ప్రాథమిక దశల్లో పాల్గొన్న వారిలో కనిపించని దుష్ప్రభావాలేమైనా తలెత్తుతాయేమో పరిశీలిస్తారు. ప్రస్తుతం ఆస్ట్రాజెనెకా అమెరికాలో 30 వేల మంది వాలంటీర్లను ప్రయోగాల కోసం తీసుకుంది. వీరిలో దాదాపు మూడు వంతుల మందికి వ్యాక్సిన్ అందజేసినట్లు సమాచారం. ఇంత భారీ మొత్తంలో టీకాను ప్రయోగించడం వల్ల ఫలితాలు మరింత కచ్చితంగా ఉంటాయని భావిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్న ఈ వ్యాక్సిన్‌తో పాటు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది వ్యాక్సిన్లు మూడో దశ క్లినికల్ ట్రయల్స్‌కు చేరుకున్నాయి.

## చమురు ధరల నియంత్రణ పిల్ కొట్టివేత



**దిల్లీ:** దేశంలో పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. కష్ట కాలంలో సామాన్యుల మీద భారం వేయకుండా చమురు ధరలు తగ్గించాలంటూ కేరళకు చెందిన షాజి కొడంకన్‌దత్ అనే న్యాయవాది సుప్రీం కోర్టులో పిల్ వేశారు. కరోనా కాలంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గగా కేంద్ర ప్రభుత్వ అధీనంలోని చమురు మార్కెటింగ్ సంస్థలు మాత్రం దేశంలో ధరలు పెంచుకుంటూ పోతున్నాయని వాదించారు. ప్రస్తుతం ఒక బ్యారెల్ ముడిచమురు ధర రూ.38 వరకు ఉందని, దానిని శుద్ధిచేసి, తయారీ ఖర్చులు కలుపుకున్నా విక్రయ ధర లీటర్‌కు రూ.30 కూడా దాటకూడదని షాజి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ ధర రూ.80 దాటిందని తెలిపారు. కాగా ఆయన వాదనలతో ధర్మాసనం అంగీకరించలేదు. షాజి వేసిన వ్యాజ్యాన్ని కొట్టేసింది. దీనిమీద తీవ్రంగా వాదించాలనుకుంటే ఖర్చులు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో న్యాయవాది ఈ కేసును వెనక్కి తీసుకున్నారు.

## 24గంటల్లో 89వేల కేసులు, 1115 మరణాలు!

### నిన్న ఒక్కరోజే 75వేల మంది రికవరీ

### దేశవ్యాప్తంగా 43లక్షల కేసులు, 73వేల మంది మృతి!



**దిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ మహమ్మారి తీవ్రత కొనసాగుతూనే ఉంది. గడిచిన 24గంటల్లో 89వేల కేసులు, 1115 మరణాలు నమోదయ్యాయి. దీంతో బుధవారం నాటికి దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 43లక్షల 70వేలకు చేరినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ వెల్లడించింది. వీరిలో ఇప్పటికే 33లక్షల 98వేల మంది కోలుకోగా మరో 8లక్షల 97వేల యాక్టివ్ కేసులు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక దేశంలో కరోనా మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. నిత్యం వెయ్యికిపైగా మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. నిన్న ఒక్కరోజే 1115మంది కరోనా రోగులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో కొవిడ్-19తో మరణించిన వారి సంఖ్య 73,890కి చేరినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే, కొవిడ్‌తో మరణిస్తున్న వారిలో దాదాపు 70శాతం మంది ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారేనని ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 77శాతం ఉండగా, మరణాల రేటు 1.7శాతం ఉంది. దేశవ్యాప్తంగా నిత్యం కొవిడ్ నిర్ధారణ పరీక్షలను భారీ స్థాయిలో చేపడుతున్నారు. నిన్న ఒక్కరోజే మరో 11లక్షల 54వేల టెస్టులు నిర్వహించినట్లు భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) వెల్లడించింది. సెప్టెంబర్ 2వ తేదీన ఒక్కరోజే రికార్డుస్థాయిలో 11లక్షల 72వేల టెస్టులు నిర్వహించారు. కొవిడ్ నిర్ధారణ పరీక్షలు భారీగా నిర్వహిస్తుండడంతో, అధిక సంఖ్యలో పాజిటివ్ కేసులు బయటపడుతున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ అభిప్రాయపడింది.

## కంగనపై విచారణ జరుపుతాం!

**ముంబై:** ప్రముఖ నటి కంగన రనౌత్ డ్రగ్స్ వాడతారంటూ అధ్యయన్ సుమన్ చేసిన ఆరోపణలపై ముంబై పోలీసులు విచారణ జరుపుతారని మహారాష్ట్ర హోం మంత్రి అనీల్ దేశ్‌ముఖ్ చెప్పారు. నటుడు శేఖర్ సుమన్ కొడుకు అధ్యయన్ గతంలో కంగనతో రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ సమయంలో ఆమె డ్రగ్స్ వాడేవారన్నారు. తాజాగా ముంబై ప్రభుత్వానికి కంగనకు మధ్య మాటల యుద్ధం నడుస్తున్న తరుణంలో ఈ ఆరోపణలపై విచారణ ఆరంభించడం గమనార్హం. మంగళవారం అసెంబ్లీలో శివసేన ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని లేవనెత్తారని, దీనిపై విచారణ జరుపుతామని అనీల్ అన్నారు.

#### నటి బంగ్లాకు నోటీసులు

బాంద్రాలోని కంగన రనౌత్‌కు చెందిన బంగ్లాకు బృహత్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు అంటించారు. తమ అనుమతుల్లేకుండా బిల్డింగ్‌లో అనేక మార్పులు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. దాదాపు డజనుకుపైగా ఇలాంటి అక్రమ మార్పులు జరిగాయని, ఉదాహరణకు టాయిలెట్‌కు చెందిన స్థలంలో ఆఫీసు కేబిన్ కట్టారని, మెట్ల వద్ద కొత్త టాయిలెట్లను నిర్మించారని బీఎంసీ



అధికారులు తెలిపారు. నోటీసులు అందుకునేందుకు ఇంట్లో ఎవరూ లేనందున బిల్డింగ్‌కు అతికించినట్లు చెప్పారు. 24 గంటల్లో వీటికి కంగన స్పందించాలన్నారు.

#### పూర్తిగా సహకరిస్తా!

డ్రగ్స్ వాడకంపై జరిపే విచారణలో పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని కంగన చెప్పారు. విచారణ కోసం తన రక్త నమూనాలను తీసుకోవచ్చన్నారు. మాదకద్రవ్యాల సరఫరాదారులతో తనకు సంబంధాలున్నట్లు భావిస్తే తన కాల్ రికార్డులను విచారించవచ్చని చెప్పారు. వేటిలోనైనా తన తప్పుందని తేలితే ముంబైని శాశ్వతంగా వీడిపోతానన్నారు. తన బంగ్లాలో అక్రమ నిర్మాణాలపై ఇచ్చిన నోటీసుకు ఆమె తన లాయర్ ద్వారా సమాధానం తెలిపారు. బీఎంసీ అధికారులు అక్రమంగా భవనంలోకి చొరబడ్డారని, వారివన్నీ నిరాధార ఆరోపణలన్నారు.

## పబ్‌జీ బ్యాన్: సంస్థ కీలక నిర్ణయం



**దిల్లీ:** యువతలో ఎక్కువగా ఆదరణ పొందిన గేమ్ పబ్‌జీని భారత్ నిషేధించిన నేపథ్యంలో పబ్‌జీ కార్పొరేషన్ దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. ప్రస్తుతం భారత్‌లో పబ్‌జీ, పబ్‌జీ లైట్ ఫ్రాంఛైజీగా ఉన్న టెన్‌సెంట్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. చైనాకు చెందిన 118 యాప్‌లను భారత్ నిషేధించిన వారం రోజుల వ్యవధిలోనే పబ్‌జీ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గత బుధవారం కొన్ని చైనా యాప్‌లను నిషేధిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన తర్వాత ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తామని టెన్‌సెంట్ ప్రకటించింది. దీంతోనే పబ్‌జీ కార్పొరేషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. "తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో పబ్జీకి ఫ్రాంచైజీగా ఉన్న టెన్‌సెంట్ నుంచి గేమ్ పబ్లిషింగ్ అధికారాలను వెనక్కి తీసుకుంటున్నాం. భవిష్యత్‌లో ఫ్రాంఛైజీలతో సంబంధం లేకుండా చూస్తాం. పబ్‌జీ గేమింగ్ అనుభవాన్ని నేరుగా భారతీయులకు అందించేందుకు పబ్‌జీ కార్పోరేషన్ ప్రయత్నాలు చేస్తోంది' 'అని పబ్‌జీ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. మరి ఈ విషయంలో కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి. చైనాతో సంబంధమున్న టెన్‌సెంట్‌ను పక్కన పెట్టడంతో పబ్‌జీ మళ్లీ ప్లే స్టోర్/యాప్ స్టోర్‌లో ప్రత్యక్షమవుతుందా? లేదా అనేది త్వరలో తెలుస్తుంది. పబ్‌జీ, పబ్‌జీ లైట్పై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ మన దేశంలో 'పబ్‌జీ'ని ఆడేందుకు ఇంకా వీలుంది. వేటుకు గురైన ఈ రెండూ మొబైల్ వర్షన్లే. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లలో ఈ ఆటను ఇకపై కూడా ఆడుకోవచ్చు. 'పబ్‌జీ' పేరెంట్ గేమ్‌కు చైనాతో సంబంధాలు లేవు. దక్షిణ కొరియాలోని పబ్‌జీ కార్పొరేషన్‌కు సంబంధించిన సర్వర్లను అది ఉపయోగించుకుంటుంది. దీంతో ఈ ఆటపై కేంద్రం పూర్తి స్థాయిలో నిషేధం విధించలేదు. పబ్‌జీని భారత్‌లో గేమర్లు డెస్కుటాప్‌లు, ల్యాప్‌టాప్‌లలో భేషుగ్గా ఆస్వాదించేందుకు ఇది వీలు కల్పిస్తోంది.


## జో బైడెన్ గెలిస్తే.. చైనా గెలిచినట్లే: డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికాలో డెమోక్రటిక్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పిం చారు. ఆమెను అమెరికా ప్రజలు ఇష్టపడ బోరని ఆయన వ్యాఖ్యానించారు. ఒకవేళ ఆమె గనుక అమెరికా ప్రెసిడెంట్ అయితే.. అది దేశానికే అవమానకరం అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాక ఆమె అధ్యక్ష పదవి రేసు నుంచి తప్పుకున్నప్పటికీ, జో బైడెన్ ఆమెను ఉపాధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ చేయడం ఆసక్తికరమైన విషయమన్నారు ట్రంప్. ఇదే సమయంలో, చైనాపై మరోసారి విమర్శలు గుప్పించారు. ప్రపంచ గొప్ప ఆర్థిక వ్యవస్థగా అమెరికాని నిర్మించామని చెప్పిన ట్రంప్... చైనా వైరస్ కరోనా వల్ల ఇప్పుడు తమ ఆర్థిక వ్యవస్థకు ఎన్నో ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జో బైడెన్ గెలిస్తే చైనా గెలిచినట్టేనని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన విధానాల వల్ల అమెరికా దిగజారిపోతుందని డ్రాగన్ దేశానికి తెలుసని చెప్పారు. జో బైడెన్ పాలసీలన్ని చైనాకు అనుకూలంగా ఉంటాయని.. అందుకే ఆయన శత్రువులు బైడెన్ గెలవాలని కోరుకుంటున్నారంటూ ట్రంప్ విమర్శలు చేశారు. అంతేకాక గతంలో తాను చైనాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఇప్పుడు చాలా భిన్నంగా చూస్తానని తెలిపారు. 'మేము చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నాం. దాని సిరా ఆరాకముందే చైనా కరోనా వైరస్‌ని ప్రపంచం మీదకు వదిలింది. కనుక ఆ వాణిజ్య ఒప్పందాన్ని నేను ఇప్పుడు గతంలో కంటే భిన్నంగా చూస్తాను' అన్నారు ట్రంప్.


## పాక్‌లో ఘోర ఘని ప్రమాదం

### 22 మంది సజీవసమాధి



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో ప్రఖ్యాతిగాంచిన జియారత్ ఘర్ పర్వతప్రాంత పాలరాయి గనిలో జరిగిన ఘోర ప్రమాదంలో 22 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. డజన్ల మంది గని కార్మికుల ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉంది. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పర్వతపాదం సమీపంలోని సఫీ పట్టణంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పాలరాయి గనిలోని ఆరు యూనిట్లు కుప్పకూలడంతో 12 మంది కార్మికులు ఘటనాస్థలిలో మరణించారు. కూలిన గని శిథిలాల కింద దాదాపు 20 మంది కార్మికులు చిక్కుకుపోయి ఉండే అవకాశముందని పోలీసు అధికారి తారిఖ్ హబీబ్ చెప్పారు. ప్రమాదం జరిగే సమయానికి అక్కడ దాదాపు 45 మంది కార్మికులు పనిచేస్తున్నారని డిప్యూటీ కమిషనర్ ఇష్తికార్ చెప్పారు. ఘటనాస్థలిలో తొమ్మిది మందిని కాపాడారు.

## దుర్గా పూజ ఆరోపణలు.. స్పందించిన దీదీ




**కోల్‌కతా:** ఒక రాజకీయ పార్టీ కావాలనే తన మీద బురద చల్లే ప్రయత్నం చేస్తుందని.. దానిలో భాగంగానే తాను ఈ ఏడాది దుర్గా పూజకు అనుమతివ్వలేదని అబద్ధాలు ప్రచారం చేస్తుందని నిప్పులు చెరిగారు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ. ఈ ఏడాది దుర్గాపూజ వద్దని తాను అన్నట్లుగా నిరూపిస్తే.. ప్రజల ముందు 101 సార్లు గుంజీలు తీస్తానని సవాలు చేశారు దీదీ. బెంగాల్ పోలీస్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 1న బెంగాల్‌లో పోలీసు డే నిర్వహిస్తారు. కానీ ఈ ఏడాది మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ మరణంతో ఈ కార్యక్రమం నేటికి వాయిదా పడింది. ఈ సందర్భంగా దీదీ కోల్‌కతా పోలీసుల ధైర్య సాహసాలను ప్రశంసించారు. కోవిడ్ నియంత్రణ కోసం వారు ఎంతో కృషి చేస్తున్నారు అన్నారు. అనంతరం దుర్గా పూజపై వస్తోన్న ఆరోపణలపై స్పందించారు దీదీ. అక్టోబర్ నెలలో వస్తున్న దసరా పండగను ప్రతి ఏటా కోల్‌కతాలో ఘనంగా నిర్వహించే విషయం తెలిసిందే. అయితే దసరా సందర్భంగా జరిపే దుర్గా పూజపై ఇప్పటి వరకు తాను ఎలాంటి సమావేశం జరుపలేదని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మమత స్పష్టంచేశారు. కరోనా కారణంగా ఈసారి దుర్గా పూజను రద్దు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె కొట్టిపారేశారు. ఓ రాజకీయ పార్టీ దురుద్దేశంతోనే దీనిపై తప్పుడు వదంతులు ప్రచారం చేస్తున్నదని.. ప్రజలు వాటిని నమ్మవద్దని మమత వెల్లడించారు.




**విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ వార్తలు**

## రెడ్ క్రాస్ భవన నిర్మాణానికి రూ.5 వేలు విరాళం

### రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ



**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 9 :** జిల్లా కేంద్రంలో నిర్మించనున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత భవన నిర్మాణానికి నగరానికి చెందిన ఫిజియోథెరపిస్టు డా.పొగిరి విశ్వేశ్వరరావు తన తండ్రి స్మారకార్థం రూ.5000 విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెక్కును జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్ లాల్ కు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులుగా చేరిన పలువురు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ డా.హరిజవహర్ లాల్ గుర్తింపు కార్డులు అందజేశారు. 15 మంది శాశ్వత సభ్యులకు కలెక్టర్ గుర్తింపుకార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ ఎం.రామ్మోహన్ రావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డా.కేశలి అప్పారావు, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు సభ్యులు మమ్ముల తిరుపతిరావు, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదమజ్జి సత్యనారాయణ, ఇ.పి.డి.సి.ఎల్. ఏ.ఇ. కిరణ్, రెడ్ క్రాస్ సభ్యులు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర గుడ్ గవర్నెన్స్ సంస్థ నుండి ప్రశంసాపత్రం అందుకున్న జిల్లా కలెక్టర్ డా.హరి జవహర్ లాల్‌ను కేశ అప్పారావు శాలువతో సత్కరించారు.

## అక్టోబర్ 2న ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ



**జియ్యమ్మవలస, వార్తావళి, సెప్టెంబర్ 9 :** అక్టోబర్ 2వ తేదీన రాష్ట్రంలోని 35 షెడ్యూల్డ్ మండలాల్లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి వెల్లడించారు. ఆదివాసీ దినోత్సవం రోజున జరగాల్సిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ కోవిడ్ కారణంగా వాయిదాపడగా ఈ కార్యక్రమాన్ని గాంధీ జయంతి రోజున పూర్తి చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశించారని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. సుమారు లక్ష కుటుంబాలకు భూమి పట్టాలను అందించనున్నామని చెప్పారు. జియ్యమ్మవలస మండలం చిన్నమేరంగిలోని అల్లువాడ చింతలపోలమ్మ ఆలయసమీపంలో దివంగత మహానేత డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి మాతృమూర్తి పాముల గౌరీ పార్వతీ జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీవాణీ పరీక్షిత్ పార్క్ ను బుధవారం పుష్పశ్రీవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగానే పార్క్ లో ఏర్పాటు చేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి, గౌరీ పార్వతి విగ్రహాలను కూడా ఆవిష్కరించారు. వైసీపీ అరకు పార్లమెంటరీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొంగు సురేష్, ఆర్పపల్లి వెంకటనాయుడు, దేవకొండ వెంకటనాయుడు, గురుప్రసాద్, గోనగంటి చంద్రయ్య, లోనుగు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఓ.ఎఫ్.ఆర్ టెలి స్పందన వినతులు సత్వర పరిష్కారం

### ఐ.టి.డి.ఏ,సహాయ ప్రాజెక్ట్ అధికారి సురేష్ కుమార్



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** అక్టోబర్ 02, 2020న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి భూమి లేని గిరిజన రైతులను గుర్తించి పట్టాలు అందించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని. అందులో భాగంగా 9వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటల నుండి 12.30 వరకు ఐ.టి.డి.ఏ పరిధిలో వున్న సబ్ ప్లాన్ మండలంలో ఆర్. ఓ.ఎఫ్.ఆర్ పట్టాల నిమిత్తం ఏటువంటి సందేహాలు ఉన్నా ఫోన్ చేసి తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకోవడానికి ఈ టెలి స్పందన కార్యక్రమం అని సహాయ ప్రాజెక్ట్ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. వినతుల వివరాలు :(1) కురుపాం మండలం లంక జోడు గ్రామానికి చెందిన ఆరిక సూర్యనారాయణ గ్రామంలో సర్వే నిర్వహించిన వారిలో కొంతమందికే వస్తున్నాయి పరిశీలించమని కోరారు. ఈ టెలి స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమానికి ఆర్. ఓ.ఎఫ్.ఆర్ తహశీల్దార్ దేవదానం పాల్గొన్నారు.

## పేస్ షీల్డ్ వాడండి.... కరోనాను ఆపండి...



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** పేస్ షీల్డ్ వాడండి. కరోనాను ఆపండి అని జిల్లా కలెక్టర్ జె నివాస్ పిలుపునిచ్చారు. పివీఎస్ రామ్ మోహన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫేషి షీల్డ్ ల పంపిణీ కార్యక్రమం ఆదివారం పేటలో బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్ జె నివాస్ ముఖ్య అతిది :గా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాస్కులతో పాటు ఫేషి షీల్డ్ ల వినియోగం తో 80 శాతం మేర కరోనా భారీన పడే అవకాశం లేదని అన్నారు. స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో స్లమ్ ప్రాంతాల్లో 25 వేల ఫేషి షీల్డ్ ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కరోనా నివారణకు జిల్లాలో అనేక చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా తాజాగా ఫేషి షీల్డ్ ల పంపిణీ చేపట్టామన్నారు. పివీఎస్ రామ్ మోహన్ ఫౌండేషన్ అధ్యక్షుడు డా. పివీఎస్ రామ్ మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 8 వేల ఫేస్ షీల్డ్ లు పంపిణీ కి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకారాన్ని అందించి కరోనాకు పారద్రోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ పి.నల్లనయ్య, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి హెచ్.కూర్మారావు, రెడ్ క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహన రావు, తహసీల్దార్ వై.యస్.ప్రసాద్, వైద్యులు డా.రవి, రెడ్ క్రాస్ సభ్యులు పి.శ్రీకాంత్, చక్రవర్తి పాల్గొన్నారు.

## బడిపిల్లలందరికీ తక్షణమే డ్రై రేషన్ పంపిణీ

### జాయింట్ కలెక్టర్ జె.వెంకటరావు



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** మధ్యాహ్న భోజనానికి బదులుగా ప్రభుత్వం ఇస్తున్న డ్రైరేషన్‌ను అర్హత ఉన్న విద్యార్థులందరికీ తక్షణమే పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ (ఆసరా, సంక్షేమం) జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు డ్రైరేషన్ పంపిణీపై విద్యాశాఖ, వివిధ సంక్షేమ శాఖల అధికారులతో తన ఛాంబర్‌లో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్షా, 79వేల, 530 మంది విద్యార్థులకు గత విద్యాసంవత్సరంలో మధ్యాహ్న భోజనం అందేదని చెప్పారు. మార్చి 19 న పాఠశాలలు మూతబడిన తరువాత నుంచి ఏప్రెల్ వరకూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడతగా డ్రైరేషన్ పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. ఆ తరువాత కూడా సుమారు లక్షా, 60వేల మంది విద్యార్థులకు ఆగస్టు వరకూ పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. అయితే కొంతమంది ఇతర మండలాలు, జిల్లాలకు చెందిన హాస్టల్ విద్యార్థులు, తమ స్వస్థలాలకు వెళ్లిపోవడంతో, వారికి డ్రైరేషన్ పెండింగ్‌లో ఉందన్నారు. అటువంటి విద్యార్థులందరినీ గుర్తించి పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యుటీ డైరెక్టర్ కె.సునీల్ రాజ్‌కుమార్, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ బి. కీర్తి, జిల్లా పౌర సరఫరా అధికారి పాపారావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ వరకుమార్, ఎఎస్‌డబ్ల్యూఓలు, గిరిజన సంక్షేమశాఖ, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్ టాప్‌లు



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్ టాప్ లను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా కలెక్టర్ జె నివాస్ పంపిణీ చేశారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సరఫరా చేసిన ల్యాప్ టాప్ లను ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ప్రభుత్వం అన్ని విధాల సహకరించుటకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మంచి ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన సూచించారు. విభిన్న ప్రతిభావంతులు ఎంతో ప్రతిభ కలవారిని ఆయన అన్నారు. తమ ప్రతిభను వివిధ రంగాల్లో చూపించి జిల్లాకు గర్వకారణం గా నిలబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జీవన్ బాబు కార్యక్రమం గూర్చి వివరిస్తూ ప్రభుత్వం దాదాపు రూ.7.50 లక్షల ఖర్చుతో లాప్ టాప్ లు సమకూర్చిందని అన్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులు కంబాల జోగులు, విశ్వాసరాయి కళావతి పాల్గొన్నారు

## 19 మండలాలు వర్షాభావ పరిస్థితి

### సంయుక్త కలెక్టరు డా. జి.సి. కిషోర్ కుమార్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** జిల్లాలో ప్రతీ సంవత్సరము ఎక్కువగా వర్షపాతము నమోదు కాబడే ఆగస్ట్ నెలలో ఈ సంవత్సరము చాలా తక్కువ వర్షపాతము నమోదు కాబడినదని సంయుక్త కలెక్టరు (రైతు భరోసా మరియు రెవిన్యు) డా. జి.సి. కిషోర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్ట్ నెలలో 195.1మి.మిల సాధారణ వర్షపాతము కాగా 92.6 మి.మి ల వర్షపాతము మాత్రమే నమోదు కావడం జిల్లా వర్షాభావ పరిస్థితిలోను ఉన్నదన్నారు. 19 మండలాలు వర్షాభావ పరిస్థితిలోను 13 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితిలోను ఉన్నాయన్నారు. జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణము 122007 హె.ల కాగా 2020 సెప్టెంబరు 7వ తేది నాటికి 77368 హె.లలో మాత్రమే వరి నాట్లు పడినవని, 181811 హె. ల వరి మరియు ఇతర పంటల సాధారణ విస్తీర్ణము కాగా 2020 సెప్టెంబరు 7వ తేది నాటికి 114489 హె. లలో మాత్రమే పంట పడినదన్నారు. సాగు నీరు లేక వడలి పోతున్న పంట పై పొటాషియం నైట్రేట్ ను ఒక లీటరు నీటిలో 3 గ్రాములు కలిపి పిచికారీ చేసినా బెట్టను కొంతవరకు తట్టుకోగలవన్నారు. కావున రైతాంగం ఎటువంటి ఆందోళనకు గురికావద్దని వర్షపాతమును ద్రుష్టిలో పెట్టుకొని తగిన విత్తనమును రైతాంగం రాయితీపై పొందగలరని జిల్లా సంయుక్త కలెక్టరు (రైతు భరోసా మరియు రెవిన్యు) తెలిపారు.

## సీతానగరం శిరోముండనం కేసులో హైకోర్టు కీలక ఉత్తర్వులు



తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగరంలో సంచలనం సృష్టించిన శిరోముండనం కేసులో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై రాష్ట్రపతి కూడా సీరియస్ అయ్యి విచారణ చేయాలని సూచించిన సంగతి తెలిసిందే. దీంతో ఏపీ సర్కార్ కూడా దీనిపై సీరియస్ గా ముందుకెళుతోంది. తాజాగా ఈ శిరోముండనం కేసులో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఈ ఆరుగురు నిందితులు న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. తదుపరి చర్యలు నిలిపివేయాలని కోరుతూ విన్నవించారు. దీనిపై విచారించిన హైకోర్టు తదుపరి విచారణను అక్టోబర్ 5కు వాయిదా వేశారు. వైసీపీ నేత కవల కృష్ణమూర్తి అతడి అనుచరులు శిరోముండనం చేయించేలా పోలీసులను ప్రోత్సహించారని బాధితుడు ప్రసాద్ ఆరోపించారు. ఈ కేసుపై రాష్ట్రపతి కూడా స్పందించి సామాజికన్యాయశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ కేసులో బాధితుడు ప్రసాద్ చెప్పేవన్నీ అబద్దాలు అని ప్రమాదంలో గాయపడ్డ విజయ్ బాబు వెల్లడించాడు. దీంతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి అక్టోబర్ 5కు వాయిదా వేసింది.

## ఆదిభట్ల గృహాన్ని సందర్శించిన వి.సి. కట్టమని



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టిమని ఈ రోజు విజయనగరంలో ఆదిభట్ల నారాయణ దాసు నివసించిన గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఆదిభట్ల నారాయణ దాసు జీవిత విశేషాలను తెలుసుకొన్నారు. దాసుగారి జీవన విధానం మరియు హరికదాగా నానికి చేసిన చేసిన కృషికి సంబంధించిన అంశాలపై యూనివర్సిటీలో ప్రత్యేక చర్చలు యూనివర్శిటీ లో విద్వాంసులనులను ఆహ్వానించి ఘోష్ఠులను నిర్వహిస్తామని చెప్పారు. ఆదిభట్లకామేశ్వరమ్మ (మనవరాలు), ఆనందనారాయణదాసు(మునిమనవడు), నందీష కుటుంబ సభ్యులను వీసీ కట్టిమని కలిసి వారిని అభినందంచారు. నారాయణదాసు గారు రచించిన కొన్ని గ్రంధాలను ఈ సందర్భంగా వీసీకి బహూకరించారు. యూనివర్సిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ హనుమంతు లజిపతిరాయి, ఏవో డాక్టర్ సూర్యనారాయణ పాల్గొన్నారు.లిరానున్న రోజుల్లో మహా కవి గురజాడ అప్పారావు గృహాన్ని కూడా సందర్శించి ఆయనకు సంబంధించిన అంశాలపై కూడా గిరిజన వర్సిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రొ. లజపతి రాయ్ తెలిపారు. ప్రముఖ ప్రజా గాయకుడు, ఇటీవలే దివంగతులైన వంగపండు ప్రసాదరావు పై కార్యక్రమాలు రూపొందించే ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. వి.సి.గా బాధ్యతలు చేపట్టిన ప్రొ. కట్టమని నగరంలోనే ఏర్పాటు చేసుకున్న నివాసానికి కుటుంబం తో సహా తరలివచ్చారు. ఇకపై గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో విద్యా సంబంధ కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## కార్పొరేట్ ప్రైవేట్ హాస్పిటల్స్ దందాను అరికట్టాలి




**పూసపాటిరేగ, వార్తావళి, సెప్టెంబర్ 9 :** కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ప్రజలను దోపిడీ చేయడాన్ని నిరసిస్తూ సిపిఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యములో తిరుమల ఆసుపత్రికీ ఎదురుగా నిరసన కార్యక్రమము జరిగింది. ఈ సందర్భముగా బుగత అశోక్ మాట్లాడుతూ కరోనా నేపధ్యములో కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్ చేస్తున్న దోపిడీని అరికట్టాలని, కరోనా తో చనిపోయిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, కార్పొరేట్ హాస్పిటల్స్ ను జాతీయం చేసి పేదలకు ఉచితముగా వైద్యము అందించాలని డిమాండ్ చేసారు. కరోనా సమయంలో పలు కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు ప్రజలను అధిక ఫీజులు రూపంలో దోపిడికి పాల్పడుతున్నాయని. ఆరోగ్యశ్రీ కింద వచ్చే బిల్లులు వరకే చికిత్స అందించి . రోగులను బయటకు పంపుతున్నారని అన్నారు .కరోనా వ్యాధి వలన ప్రజల్లో నెలకొన్న భయాన్ని అడ్డం పెట్టుకుని . ధన రూపం లోకి మార్చుకొని విచ్చలవిడిగా వైద్యాన్ని వ్యాపారం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని ఉన్న ప్రైవేట్ .కార్పొరేట్ ఆసుపత్రులు జాతీయం చేసి రోగులకు ఉచిత చికిత్స అందించాలని అలాగే ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్లు. నర్సులు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని . అలాగే నిరుద్యోగ యువతకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సభ్యులు ఎస్.రంగరాజు, తుమ్మి అప్పలరాజు దొర, టి.జీవన్, అప్పరుబోతు జగన్నాధం, ఏ. రాములు, ఇబ్రహీం, గౌరీశంకర్, రాజేష్, సునీల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## అశ్లీలతకు అడ్డాగా మారిన బిగ్ బాస్ షోని రద్దు చేయాలి

### ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ జీవన్ డిమాండ్




**కొత్తవలస, వార్తావళి, సెప్టెంబర్ 9 :** అశ్లీలతకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన నాగార్జున బిగ్ బాస్ షో నీ రద్దుచేయాలని అఖిలభారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ. జీవన్ డిమాండ్ చేశారు. విజయనగరం సిపిఐ అమర్ భవన్ లోజరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో టీ జీవన్ మాట్లాడుతూ సినీ హీరో అక్కినేని నాగార్జున హెూస్ట్ గా వ్యవహరిస్తున్న బిగ్ బాస్ షో వలన ప్రజలకు యువతకు ఎటువంటి ఉపయోగం లేకపోగా బిగ్ బాస్ హౌస్‌లో షోలో అశ్లీలత, పరుషపద జాలంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చి వీడియోల ద్వారా ప్రజలకు ఇస్తూ ఎంటర్టైన్మెంట్ ఇస్తున్నామని చెప్తున్నారు. గతంలో జరిగినటువంటి బిగ్ బాస్ షోలో అనేక గొడవలు లు అభ్యర్థులు ఓటింగ్ విషయంలో పెద్ద గోల్మాల్ జరిగి చర్చనీయాంశమైన నా పిఆర్పి రేటింగ్‌ల కోసం మా టీవీ లాంటి సంస్థలు ఇటువంటి షో లు నిర్వహించడం బాధాకరమని, యువతకు ప్రజలకు మంచి చెప్పాల్సిన, తెలియజేయాల్సిన ప్రముఖ హీరో నాగార్జున ఇటువంటి కార్యక్రమాలకు హెూస్ట్‌గా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయుకులు వెలగాడ రాజేష్, ఎస్.సునీల్, బి వాసు,లండ శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సచివాలయం - అసెంబ్లీలో కరోనా కల్లోలం!!




ఆంధ్రప్రదేశ్‌లో కరోనా కల్లోలం సృష్టిస్తోంది. ప్రతీరోజు 10వేల కేసులు చొప్పున బయటపడుతున్నాయి. కరోనా ప్రభావం అధికంగా కనిపిస్తున్నప్పటికీ సచివాలయం అసెంబ్లీలో ఉద్యోగులు పనిచేస్తూనే ఉన్నారు. తాజాగా నిన్న ఒక్కరోజే ఏపి పరిపాలన కేంద్రమైన సచివాలయంలో ఏకంగా 19 కేసులు బయటపడడం కలకలం రేపింది. దీంతో సచివాలయంలో మొత్తం కేసుల సంఖ్య 138కి చేరింది. దీంతో ఉద్యోగులు సచివాలయానికి రావాలంటేనే భయపడిపోతున్నారు. ఇక సచివాలయంలో కరోనా ఎఫెక్ట్ తో మంత్రులు ఇటు వైపే రావడం లేదు. చివరికి భద్రతాకారణాలతో సచివాలయం అసెంబ్లీ ఎంట్రీ గేట్లను కూడా అధికారులు మూసివేయడం గమనార్హం. కేవలం అత్యవసర విధుల్లో ఉన్న ఉద్యోగులకు మాత్రమే ప్రత్యేక అనుమతులతో వారి బ్లాకుల్లోకి అనుమతిస్తున్నారు. మిగతా వారిని వర్క్ ఫ్రం హెూం ఇస్తున్నారు. కాగా ప్రభుత్వం మొదట్లో కరోనా చర్యలు బాగా చేపట్టిందని.. ఇప్పుడు శానిటైజర్లు మాస్కులు కూడా అందుబాటులో లేవని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. తమకు సెలవులు ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

## వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారులకు శిక్షణ



**పార్వతీపురం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు కలక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సంయుక్త కలక్టరు (ఆసరా) జె. వెంకటరావు, డిఆర్డిఎ ప్రాజక్టు డైరక్టరు కె. సుబ్బారావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో హిందుస్థాన్ యూని లీవర్ లిమిటెడ్, ఐటిసి, పిఎన్జి కంపెనీ ప్రతినిధులు లబ్ధదారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. సరుకుల పంపిణీ, వ్యాపార నిర్వహణ, ధరల పట్టిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన పలు విషయాల్లో లబ్ధిదారులకు మెళకువలు నేర్పారు. ఈ క్రమంలో లబ్ధిదారులు అడిగిన ప్రశ్నలకు ఆయా కంపెనీల ప్రతినిధులు సమాధానాలు ఇచ్చారు. ప్రభుత్వం వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా అందిస్తున్న ఆర్ధిక సాయాన్ని వినియోగించుకొని ప్రతి మహిళా స్వయం సమృద్ధి సాధించాలని, మంచి వ్యాపారవేత్తగా రాణించాలని సంయుక్త కలక్టరు (ఆసరా), డిఆర్డిఎ ప్రాజక్టు డైరక్టరు లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, పలు బ్యాంకుల ప్రతినిధులు, కార్పోరేట్ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## వివాహ వయసుపైనే మొగ్గు

దేశంలో ప్రసూతి మరణాల రేటు తగ్గించడం కోసం ఆడపిల్లల వివాహ వయసు పెంచే ప్రతిపాదన పరిశీలిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ మొన్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రకటించిన నాటి నుంచీ దానిపై మిశ్రమ అభిప్రాయాలు వస్తున్నాయి. వాస్తవానికి కేంద్రంలోనే స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖకూ, ఆరోగ్యమంత్రిత్వ శాఖకూ మధ్య ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నట్టు కథనాలొచ్చాయి. సుప్రీంకోర్టు ఒక కేసు సందర్భంగా 2017లో చేసిన సూచన ఈ ప్రతిపాదనకు మూలం. వివాహ వయస్సు పొడిగించే అంశాన్ని పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానం అప్పట్లో కేంద్రానికి సూచించింది. మన దేశంలో ప్రస్తుతం యువతుల వివాహ వయసు 18 ఏళ్లుకాగా, యువకులకు అది 21 ఏళ్లు. సుప్రీంకోర్టు తీర్పునిచ్చినప్పుడు కేంద్రం యువకుల వివాహ వయసును కూడా 18 ఏళ్లకు తగ్గిద్దామన్న యోచన చేసింది. లా కమిషన్ దీనివైపే మొగ్గు చూపింది. జాతీయ మానవ హక్కుల సంఘం ఇద్దరి వివాహ వయసూ సమం చేస్తే మంచిదని అభిప్రాయపడింది. మొత్తానికి ఈ ప్రతిపాదనపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దేశంలో ప్రసూతి మరణాల రేటు(ఎంఎంఆర్) ఎక్కువగా వుండటానికి కారణం ఆడపిల్లకు 18 ఏళ్లకే పెళ్లవడం వల్లనేనని వైద్యరంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఎంఎంఆర్ ప్రస్తావన కూడా వుంది. ప్రతి లక్ష జననాలకూ ఎంఎంఆర్ 70కంటే తక్కువుండాలని ఆ లక్ష్యాలు సూచిస్తున్నాయి. 2017నాటి జాతీయ ఆరోగ్య విధానం ప్రకారం మన దేశంలో 2020నాటికి ఆ రేటు కనీసం 100కు పరిమితం కావాలి. కానీ కమిషన్ లక్ష్యాన్ని ఇంతవరకూ సాధించిన రాష్ట్రాల సంఖ్య కేవలం 11 మాత్రమే. ఈ కారణాలన్నిటివల్లా యువకుల వివాహ వయసు కుదించేకంటే ఆడపిల్లల వివాహ వయసునే పెంచితే మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే గత బడ్జెట్ సమా వేశాల్లో సమతా పార్టీ మాజీ నాయకురాలు జయా జైట్లీ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని నియ మించారు. వాస్తవానికి ఆ కమిటీ ఇంకా తన నివేదిక అందజేయాల్సివుంది. అది అందాకే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని మోదీ అన్నారు గనుక వచ్చే నెలలో ప్రారంభం కాబోయే వర్షాకాల సమావేశాల్లో దీనిపై బిల్లు పెట్టకపోవచ్చు. రెండు కేంద్ర మంత్రిత్వ శాఖలు ఆడపిల్లల పెళ్లి వయసుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడానికి వేర్వేరు కారణాలున్నాయి. ఆడపిల్లల్లో చదువుకునేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతున్నది కనుక వారి వివాహ వయసు పెంచడం అవసరమని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వాదించింది. డిగ్రీలో చేరేనాటికి వారిని పెళ్లి పేరుతో కట్టిపడేసే తీరువల్ల ఆడపిల్లల చదువు కుంటుపడుతోందని, అనేకులు పూర్తిగా చదువు మానేస్తున్నారని ఆ శాఖ వివరించింది. పైగా మగపిల్లల వయసును 18 ఏళ్లకు తీసుకురావడంవల్ల జనాభా నియంత్రణ ఆశయం కుంటుపడుతుందని హెచ్చరించింది. కానీ ఆరోగ్యమంత్రిత్వ శాఖ వాదన మరోలా వుంది. ఆడపిల్లలు 21 ఏళ్ల వయసులోపే లైంగికంగా చురుగ్గా వుంటారని, వివాహ వయసు పెంచితే వారిలో అనేకులు పునరుత్పత్తి ఆరోగ్య రక్షణ వినియోగించుకోవడంలో లేదా లైంగికహక్కుల రక్షణ విషయంలో వెనకబడతారని హెచ్చరించింది. అలాగే ఈ సవరణ వల్ల చాటుమాటుగా బాల్య వివాహాలు పెరిగే అవకాశం వుందని తెలిపింది. ఈ మాదిరి వివాహాన్ని భాగస్వాముల్లో ఎవరో ఒకరు సవాలు చేస్తేనే అది రద్దవుతుందని గుర్తుచేసింది. దీనికి పరిష్కారంగా ఫిర్యాదుతో పనిలేకుండా బాల్యవివాహం దానంతటదే చెల్లుబాటు కాదని నిర్దేశించేలా చట్టాన్ని సవరిస్తే సరిపోతుందని కేంద్రం అనుకుంది. ఆరోగ్య రంగ నిపుణులైతే 20 ఏళ్లు దాటాకే ఆడపిల్ల శరీరం గర్భధారణకు అన్నివిధాలా అనువుగా వుంటుందని చెబుతున్నారు. అలాగే పద్దెనిమిదేళ్లకే పెళ్లవడం వల్ల ఆడపిల్లపై సామాజికంగా, కుటుంబీకంగా ఒత్తిళ్లు మొదలవుతాయని, ఆ సమయంలో గర్భం ధరించడం వల్ల ఆమె ఆరోగ్యం మరింతగా దెబ్బతింటుందని, మన దేశంలో ఎంఎంఆర్ అధికంగా వుండటానికి కారణం ఇదేనని వారు చెబుతున్న మాట. చట్టాలేమంటున్నాయి... కేంద్ర మంత్రిత్వ శాఖలు కారణాలు ఏం చెబుతున్నాయన్న సంగతలా వుంచితే ఆడపిల్ల ఇష్టాయిష్టాలను గమనించి మంచి చదువు చదివించడం, ఆమె విద్యాధికు రాలయ్యేలా ప్రోత్సహించడం నాగరిక లక్షణం. మన దేశంలో 171 ఏళ్ల క్రితమే మహారాష్ట్రకు చెందిన సంఘసంస్కర్తలు జ్యోతిరావు పూలే, సావిత్రీబాయ్ పూలే దంపతులు ఆడపిల్లల్ని కూడా మగపిల్లలతో సమానంగా చదివించాలన్న చైతన్యం కలిగించేందుకు ఉద్యమించారు. కానీ విషాద మేమంటే ఈనాటికీ అది సాకారం కాలేదు. విద్యాహక్కు చట్టం వచ్చి దశాబ్దం దాటుతున్నా ఆడ పిల్లల్ని చదివించడానికి కుటుంబాలు సంసిద్ధం కావడం లేదు.

## చరిత్రలో సెప్టెంబర్ 10

# చిత్రకారుడు వడ్డాది పాపయ్య జయంతి

**ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం**

**1887 : భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఒక ప్రముఖ నాయకుడు గోవింద్ వల్లభ్ పంత్ జననం (మ.1961).**

**1895 : కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జననం (మ.1976). (చిత్రంలో)**

**1905 : పాతతరం తెలుగు చలనచిత్ర సంగీతదర్శకుడు ఓగిరాల రామచంద్రరావు జననం (మ.1957).**

**1920 : ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు మరియు గణాంక శాస్త్రజ్ఞుడు కల్యంపూడి రాధాకృష్ణ రావు జననం.**


**1921 : ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య జననం (మ.1992).**

**1922 : ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రసాయన శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ జననం.(మ.1985)**

**1985 : తెలంగాణా వీరవనిత చాకలి ఐలమ్మ మరణం (జ.1919).**

**1992 : దక్షిణ భారత నటి కేథరీన్ థెరీసా జననం.**

**1944 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ దండు నారాయణ రాజు మరణం.(జ.1889)**



భారతదేశానికి గర్వకారణమైన చిత్రకారుడు వడ్డాది పాపయ్య (సెప్టెంబరు 10, 1921 – అక్టోబరు 30, 1992). ప్రాచీన సాహిత్యాన్ని అకళింపు చేసుకొని తన కుంచెకు సాహితీ సౌరభాన్ని పులిమి చిత్రాలను చిత్రించిన ప్రత్యేక చిత్రకారుడు వడ్డాది పాపయ్య.గీతకు అర్థం ఉంటుంది. రూపానికి ఆహ్లాదం ఉంటుంది. కొన్ని స్ట్రోక్స్ కలసి రూపం అవుతుంది. దానిలో గీతలు రూపంలోని ఆనందానుభూతిగా వెల్లివిరు స్తుంది. ఈయన బొమ్మలు కేవలం రసాత్మకంగానే ముగిసి పోక రస జగత్తును అధిగమించాయి. లాలిత్యం కంటే గాంభీ ర్యం, అనుభూతి కంటే ఆలోచన ఎక్కువ పాళ్ళలో ఉండి సౌందర్యాన్ని మించిన శక్తిని కన్పింపజేసిన వడ్డాది పాపయ్య శ్రీకాకుళం పట్టణంలో జన్మించారు. "అతి సామాన్యమైన రంగుల్లోంచి అత్యద్భుతమైన బొమ్మలను, ఇంద్ర ధనుస్సులో కూడా కానరాని రంగుల కలయికనూ చూపగలిగిన వడ్డాది పాపయ్య కళాజీవితం ఎంతటి ఉన్నతమో, వ్యక్తిగత జీవితం అంతకంటే గొప్పది. పల్లె పడతుల అంద చందాలను, స్నిగ్ధ మనోహర వలపు తలపులను చిత్ర కళాకారులు ఏనాటి నుంచో చిత్రీకరించినా వ.పా శైలి మాత్రం అజరామరంగా నిలిచి పోతుంది. మత్స్య గ్రంధి, ఊర్మిలనిద్ర, పంచతంత్రం కథలలోని జంతు ప్రపంచం ఈయన కుంచె కదలికలతో జనజీవాలు నింపుకొని కళాభిరుచి గూర్చి తెలియని పామ కుల్ని సైతం కళాభిమానులుగా తీర్చిదిద్దాయి. తెలుగు నాట చిత్రకళలో ఈయన శైలికి, బొమ్మలలోని సంతకానికి అందినంత గుర్తింపు గౌరవ ప్రతిష్టలు మరెవరికీ అందలేదనే చెప్పాలి. అయితె ఈయన ప్రతిభ యావత్తూ పరిమిత వర్గం లోనే అవగాహనకు అందింది. చరమ దశలో ఒక పత్రిక యాజమాన్యం ఈయన చిత్ర కళను గుత్తకు తీసుకొని వాణిజ్య పరంగా రాణించింది. ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య పవిత్ర నాగావళి నదీ తీరాన శ్రీకాకుళం పట్టణంలో రామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు సెప్టెంబరు 10, 1921 న జన్మించారు. తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడంతో ఓనమాలు తండ్రి వద్దనే నేర్చి . తండ్రి బొమ్మలు గీచే పద్ధతిని చాలా శ్రద్ధతో పరిశీలించేవారు. క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నారు. పట్టుదలతో సాధన చేశారు. రంగులు కలపడం, వాటిని ఉపయోగించే పద్ధతిని తండ్రి వద్దనే నేర్చుకున్నారు. తండ్రి బొమ్మలు వేస్తున్నంతసేపూ ఆయనకంటే దీక్షగా పరిశీలించుతూ కచ్చితమైన పెర్ఫెక్టి వ్‌నెస్ జాడలను తెలుసుకొనేవారు. రంగులు కలపడం, బ్రష్ లు ఎప్పటి కప్పుడు శుభ్రం చేయడం వంటి పనులన్నీ వినయ విధేయలతో నెరవేరుస్తూ తండ్రి వద్ద శిష్యుడి పాత్రను అద్వితీయంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాల పిన్న వయసులోనే తన ఇంటిలో ఉన్న రవివర్మ చిత్రం "కోదండ రామ"ను ప్రేరణగా తీసుకుని హనుమంతుని చిత్రాన్ని గీసారు. పాపయ్య చిన్న తనంలో తండ్రి భారత, భాగవతాలను వినిపిస్తుండేవారు. ఆ ప్రభావం వలన పాపయ్య ఆధునికత కంటే ప్రాచీనత మీద, ముఖ్యంగా భారతీయ శిల్ప, చిత్ర కళల మీద మక్కువ పెంచుకొన్నాడు. ఆయన ఊహ ఎదిగాక, చేతివేళ్ళతో వంపుసొంపులు ఇమిడిన అర్వాత రాజా రవివర్మ, దామెర్ల రామారావుల చిత్రకళా తపస్సును ఆదర్శంగా ఎంచుకున్నారు. అంతరాంతరాలలోని "ఇన్‌ట్యూషన్"తో ఉండే సౌందర్య కాంక్షను దామెర్ల ప్రతిభా వ్యుత్పత్తుల నుండి పుణికి పుచ్చుకున్నారు. అందుకు హస్త కౌశాలం కూడా జత పడింది. మరి కొంత కాలానికి మహారాష్ట్ర ప్రభుత్వ చిత్రకారుడు దురంధర్ నుంచి స్ఫూర్తి పొందారు. దురంధర్ చిత్రాలను తమ మనోఫలకంలో శాశ్వతంగా ముద్రించుకున్నారు. దేవతా చిత్రాలను గీసే ప్రేరేపణను ముఖ్యంగా రవివర్మ నుంచి పొందారు.

# అంతిమ నిర్ణయం దైవానిదే!



'తానొకటి తలిస్తే దైవం ఇంకొకటి తలచినట్లు..' అనేది అందరికీ తెలిసిన సామెతే. ఇందులో 'తలచడమనేది' ఏదో కార్యసిద్ధికేనని వేరుగా చెప్పవలసిన పనిలేదు. ఇం దులో ఇద్దరు మనకు కనిపిస్తున్నారు. ఒకరు మనిషి, ఇం కొకరు దైవం. మనిషి ఒక కార్యం చేయాలని సంకల్పించినప్పుడు అది కాకపోతే 'దైవం ప్రతికూలించిందని' అనుకుంటాం. అప్పుడే పైన చెప్పిన సామెత గుర్తుకువస్తుంది. ఒకవేళ మనిషి అనుకున్నదే జరిగితే 'దైవం అనుకూలించిందని' ఆస్తికవాదులు అనుకోవడం, 'అంతా తన వల్లనే జరిగిందని' నాస్తికవాదులు భ్రమ పడటం జరుగుతుం టుంది. ఇంతకూ, 'మనిషి సంకల్పానికి, దైవం అను కూలించడం లేదా ప్రతికూలించడం' అనే విషయానికి 'ప్రామాణికమైన నిదర్శనం' ఏమైనా ఉన్నదా? ఉంటే, దానినుంచి మనం నేర్చుకునే సందేశం ఏమిటి? జిజ్ఞాసువుల ఈ ప్రశ్నకే 'భగవద్గీత'లో శ్రీకృష్ణ భగవాను డు అత్యంత స్పష్టమైన సందేశం ఇచ్చాడు. 'వేదాంత తత్త్వాన్ని అనుసరించి కర్మలు సిద్ధించడానికి అయిదు కారణాలుంటాయి. అవే: కార్యస్థానం, కర్త, నానాం కాలైన పనిముట్లు, పలువిధాలైన యత్నాలు, తుట్టతుద కు దైవం. దేహంతో, మనస్సుతో లేదా వాక్కు తో మనిషి చేసే న్యాయమైన లేదా అన్యాయమైన ఏ కార్య మైనా ఈ అయిదు కారణాల ద్వారానే నెరవేరుతుంది' (భగవద్గీత: 18వ అధ్యాయం, 13–15 శ్లోకాలు). ఈ విధంగా శ్రీకృష్ణ భగవానుడు ఈ జగత్తులో జరిగే ఏ కార్యానికైనా ఉండే ఐదు కారణాలను సంపూర్ణంగా తెలియజేశాడు. ఇందులో మొదటి నాలుగు కారణాలు మానవుని చేతిలో ఉన్నాయి. కానీ, చివరి కారణం సాక్షాత్తుగా దైవమే. ఈ ఐదింటిలో ఏ ఒక్కటి లోపించినా కార్యసిద్ధి కానేకాదు. నిజానికి కార్యాలు ప్రారంభించని వారుండరు. కానీ, మనం తలపెట్టే కార్యాలలో అన్నీ విజయవంతం కావు. పది పనులు మొదలుపెడితే ఆరు పూర్తవుతాయి. నాలుగు మూతప డుతుంటాయి. నిజానికి మనమే కర్తలమైనా, కొన్ని పనులు సఫలీకృతం కావడం, మరికొన్ని కాకపోవడం మనకే ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ, ఎప్పుడైతే భగవద్గీతలో దేవాదిదేవుడు చెప్పిన 'కర్మసిద్ధి కారణాలు' అర్థం చేసుకోగలుగుతామో, అప్పుడు తలపెట్టే కార్యాల న్నింటినీ జయప్రదం చేసుకు నే అవకాశం మన చేతుల్లోనే ఉంటుం ది. ఇదే 'భగవద్గీత' మనకు ఇచ్చిన అద్భుత వరం. పై అయిదు కారణాలలో ఒక్కొక్క దాని వంతు 20 శాతంగా భావిస్తే, మనిషి చేతిలో 80 శాతం, దైవం చేతిలో 20 శాతం 'ఫలితం' ఉన్నట్టు లెక్క. '80 శాతం మన చేతిలోనే ఉన్నది కాబట్టి, కార్యసిద్ధి మన వల్లే జరిగి తీరు తుందని' చెప్పలేం. ఒకవేళ అదే అనుకుంటే అహంకారమే తప్ప మరొకటి కాదు. ఎందుకంటే, దైవం కూడా తన 20 శాతాన్ని జోడించవలసిందే. అప్పుడే మొత్తం వంద శాతం కార్యం పూర్తయి ఫలసిద్ధి జరుగుతుంది. అయితే, 'తన వంతు జోడించా లా, వద్దా' అనేది దైవ నిర్ణయం. కనుక, 'దైవానిదే పైచేయి' అవుతుంది. ఒకవేళ దైవం తన వంతు జోడించకపోయినప్పుడు మాత్రమే 'తానొకటి తలిస్తే దైవం ఇంకొకటి తలచినట్లు' అనే సామెత మన అనుభవంలోకి వస్తుంది. దీనికి నిత్య జీవితంలో ఎన్నో సంఘటనలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. భగవద్గీతలో 'దైవం చైవాత్ర పంచమమ్' (దైవమే చరమ ఐదవ కారణం) అని ఉంది. కాబట్టి, మన కార్య సాఫల్యంలో దైవిక ప్రభావం, విలువ ఎంతటిదో ప్రతి ఒక్కరం తెలుసుకోవాలి. దైవం అనుకూలించక పోవడం వల్లే ప్రపంచం ఇప్పుడు తాజా ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్నది. ఇది మనం 'భగవద్గీత' నుంచి నేర్చుకోవాల్సిన అతిముఖ్యమైన విషయం. అందుకే, భగవద్గీత 'మానవ జీవితాలకు ఒక చక్కని దిక్సూచి (మార్గదర్శి)' అని చెప్పడం.

# సుమంత్రుని దైన్యం

(నిన్నటి తరువాయి)



అది మంత్రిగా నీ ధర్మం. నా కోరిక కూడా." అన్నాడు రాముడు. ఏం మాటా డాలో అంతు చిక్కలేదు సుమంత్రునికి. తలకొట్టుకుని ఏడ్చాడు."నిన్ను చూస్తోంటే నాకేమనిపిస్తోందో తెలుసా రామయ్యా! ఈ బ్రహ్మచర్య ఋజుత్వ శీలాలన్నీ నిష్ప్రయోజనం అనిపిస్తోంది. నీలాంటివాడే విధికి ఎదురీద లేకపోతే, మేమెంతటి వారమనిపిస్తోంది. ఏదైనా నీ దీక్ష గొప్పదయ్యా! ముల్లోకాలూ నిన్ను కీర్తించక తప్పదు." అన్నాడు సుమంత్రుడు. చేయెత్తి రాముణ్ణి దీవించాడు. సీతాలక్ష్మణులనూ, వారినీ వీరినీ అందరినీ చూశాడు. ఏం చెయ్యాలో పాలుపోవట్లేదు. రాముణ్ణి అడిగాడిలా."నాకు వేరే దారి లేదా రామయ్యా? నేను అయోధ్య వెళ్ళక తప్పదా? ఆ పాపాత్మురాలు కైకను సేవించక తప్పదా? ఇంతేనా, ఇంతేనా నా బతుకు? ఇదేంటి రామయ్యా, ఇలా ముగిసిపోతోంది నా జీవితం? అంతా అయోమయంగా ఉందయ్యా, నాకేమీ అర్థం కావట్లేదు."తల పట్టుకున్నాడు సుమంత్రుడు."నేను నీతో పాటు ఉండే అవకాశం లేదా? నాకు నీ సాన్నిధ్యం అందదా?" అడిగాడు. రాముణ్ణి కౌగిలించుకుని భోరుమన్నాడు. ఓదార్పుగా సుమంత్రుని వెన్ను నిమిరాడు రాముడు. చేతులు పట్టుకుని వేరుచేసి, అతని కన్నీటిని తుడిచాడు."మా రాఘవులకు ఆప్తమిత్రుడవు. నాకు ప్రియాతి ప్రియమైనవాడవు. నువ్విలా దుఃఖించడం నేను తట్టుకోలేను సుమంత్రా." అన్నాడు రాముడు."మంత్రిగా నీ ధర్మం నువ్వు నిర్వర్తించాలి. వెళ్ళి, మహారాజును నువ్వు సేవించాలి. అయినా నువ్వుగాక నా తండ్రి దుఃఖాన్ని పోగొట్టే సమర్థుడు ఇంకెవరున్నారు చెప్పు?" అడిగాడు రాముడు."నా తండ్రి వృద్ధుడు. దుఃఖం ఎలా ఉంటుందో తెలియని వాడు. ఇప్పుడు నాకోసం కన్నీరుమున్నీరవుతున్నాడు. ఓ మంత్రిగా నువ్వు తప్ప ఆయన్ని ఓదార్చే వారేరి? నా మీది అభిమానంతో నువ్వు వారిని అసహ్యించుకుంటే మాత్రం అంతకంటే పాపం ఇంకొకటి లేదు. దయచేసి వారిని అసహ్యించుకోకు. వెళ్ళు. కైకమ్మా, నా తండ్రీ ఏం చెబితే అది చెయ్యి." అన్నాడు రాముడు. "మహారాజుకు నా సాష్టాంగ ప్రణామాలు చెప్పు. వనవాసం చేయాల్సి వచ్చినందుకు నేను బాధపడడం లేదని చెప్పు. సీతాలక్ష్మణులు సైతం హాయిగా సుఖంగా ఉన్నారని చెప్పు. పద్నాలుగేళ్ళూ ఇట్టే గడిపి, వెంటనే అయోధ్యకు చేరుకుంటానని చెప్పు. అలాగే రమ్మని కబురుపెట్టి, భరతుణ్ణి వెంటనే పట్టాభిషిక్తుణ్ణి చెయ్యమను. నాకంతకంటే సంతోషకరమైంది ఇంకొకటి లేదని చెప్పు. భరతునికి నా ఆశీస్సులందజేసి, తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోమను. అమాయకురాలు సుమిత్రాదేవినీ, నా తల్లి కౌసల్యనూ కనికరించమను. ఈ మాటలే మా అమ్మాగారికి కూడా చెప్పు. కైకమ్మకు కూడా ఇవే మాటలు చెప్పి, ఆమె క్షేమాన్ని అడిగానని చెప్పు. వెళ్ళు." అన్నాడు రాముడు. వెళ్ళలేనన్నట్టుగా చేతుల్లో ముఖాన్ని దాచుకుని రోదించసాగాడు సుమంత్రుడు. "నిన్నిక్కడ అడవులపాల్జేసి, పుత్రశోకంతో తల్లడిల్లే అక్కడ ఆ అయోధ్యకు నేను చేరుకోలేను రామా, చేరుకోలేను. నీకోసం అయోధ్య పౌరులు కూడూనీరూ మానుకుని ఎలా ఘోషించారో చూశావు కదా, ఇప్పుడు ఖాళీ రథంతో నేను అయోధ్యకు చేరుకుంటే వాళ్ళేమవుతారో ఒక్కసారి ఆలోచించు." అన్నాడు సుమంత్రుడు.సమాధానంగా తల దించుకున్నాడు రాముడు."నేను వచ్చానని తెలిసి, నీ తల్లి పరిగెత్తుకొచ్చి, సుమంత్రా! నీతో పాటు తీసుకుని వెళ్ళిన నా రాముణ్ణేం చేశావయ్యా అంటే నేనేం సమాధానం చెప్పను? మేనమామగారింట వదిలానని అబద్ధం చెప్పనా? లేదంటే అడవులకు అప్పజెప్పానని నిజం చెప్పనా? నిజం చెబితే నీ తల్లి తట్టుకోగలదా?" అడిగాడు సుమంత్రుడు. సమాధానంగా కన్నీటితో తలెత్తి చూశాడు రాముడు. "అందుకని, ఓ మాట రామయ్యా! నన్ను నీతోపాటు తీసుకునిపో! ఇదే రథం మీద మనం అందరం అడవుల్లోకి వెళ్ళిపోదాం. అక్కడ మీ ముగ్గురికీ ఏ ఆపదా రాకుండా నేను చూసుకుంటాను. మీరు తపస్సు చేసుకుంటూ ఉండండి, మీ తపస్సుకు భంగం కలగకుండా నేను వన్యమృగాలను వేటాడి సంహరిస్తాను. అంతేకాదు రామయ్యా! నువ్వు చెప్పినట్టుగానే నీ పద్నాలుగేళ్ళ అరణ్యవాసం ఇట్టే అయిపోతుంది. నిర్విఘ్నంగా జరిగిపోతుంది. అప్పుడు ఇదే రథం మీద మనం అంతా అయోధ్యకు చేరుకుందాం. ఏమంటావు?" అడిగాడు సుమంత్రుడు."నా మాట కాదనకయ్యా" అని రాముని పాదా లను పట్టుకున్నాడు. సుమంత్రుని లేపి, గట్టిగా కౌగిలించుకున్నాడు రాముడు. తర్వాత అన్నాడిలా."నీ బాధంతా నాకర్థమయింది సుమంత్రా! అర్థం కాలేదని అపోహపడకు. దయచేసి నేను చెప్పేది విను! నువ్వు ఈ పరిస్థితుల్లో అయోధ్యకు వెళ్ళి తీరాలి, తప్పదు." అన్నాడు రాముడు."ఎందుకు తప్పదంటున్నానంటే...కైకమ్మ సంగతి నీకు తెలియంది కాదు. ఆమెకు దయాదాక్షిణ్యాలు లేవు.

(మిగతా రేపటి సంచికలో)

# హార్మోన్ల సమతౌల్యానికి...



మాటల్లో వ్యక్తం చేయలేని నిస్సత్తువ, అదుపు తప్పే భావోద్వేగాలు, కండరాల నొప్పులు... ఇలా శారీరక, మానసిక ఒడిదుడుకులకు లోనవడం మెనోపాజ్‌కు చేరుకున్న మహిళల్లో కనిపించే సాధారణ లక్షణాలు. వీటిని సకాలంలో గుర్తించి, సత్వరం సరిదిద్దుకుంటే జీవితం తిరిగి గాడిలో పడుతుంది. ఆయుర్వేద చికిత్సల ద్వారా శరీరంలో చోటుచేసుకున్న హార్మోన్ హెచ్చుతగ్గులను సమం చేయాలంటే కొన్ని నియమాలు పాటించాలి. అవేంటంటే...

**త్రిఫల:** నిస్సత్తువ, బడలిక, అజీర్తి, ఆకలి మంగించడం లాంటి ఇబ్బందులు జీర్ణవ్యవస్థ నీరుకారడానికి సూచనలు. ఈ సమస్య ఉన్నప్పుడు జీర్ణాగ్నిని వృద్ధి చేసే చికిత్సలు పాటించాలి. ఇందుకోసం త్రిఫల చూర్ణం తీసుకుంటే అజీర్తి కారణంగా శరీరంలో పేరుకుపోయిన మలినాలు, విసర్జకాలు విసర్జింపబడి శరీరం పునరుత్తేజం పొందుతుంది. ఈ చూర్ణాన్ని రోజూ రాత్రి నిద్రకు ముందు తీసుకుంటే భావోద్వేగాల్లో మార్పులు, మానసిక కుంగుబాటు మొదలైన మానసిక సమస్యలు కూడా అదుపులోకి వస్తాయి.

**అశ్వగంధ:** వయసు మీరకుండానే వృద్ధాప్య లక్షణాలు తలెత్తే పరిస్థితి కార్టిసాల్ అనే హార్మోన్ అధిక ఉత్పత్తితో వస్తుంది. అశ్వగంధ వాడితే పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడి తద్వారా కార్టిసాల్ హార్మోన్ స్రావం అదుపులోకి వస్తుంది. మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళలకు కూడా ఈ మూలిక మేలు చేస్తుంది.

**కటుంబ బెరడు:** ఈ మొక్క బెరడులో యోహింబైన్ అనే ఉత్ప్రేరకం ఉంటుంది. ఇది నాడీ వ్యవస్థను చైతన్యపరిచడం ద్వారా భావోద్వేగాలను అదుపులో ఉంచుతుంది. ఆయుర్వేదంలో ఈ మూలికతో హార్మోన్ల అవతవకలను వైద్యులు విస్తృతంగా సరిదిద్దుతున్నారు.

**ఓట్లు కాండం:** ఓట్లు కాండం నుంచి సేకరించిన సారం అవీనా సెటైవా. నెలసరి నొప్పులు తగ్గించే గుణం దీనికి ఉంది. మహిళల్లో టెస్టోస్టిరాన్ హార్మోన్ పరిమాణాన్ని సమంగా ఉంచుతూ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.

**మాక:** ఇది పెరూలో దొరికే వేరు. పెరూవియన్ జిన్‌సెంగ్ అనే పేరున్న మాక నిద్ర, పునరుత్పత్తి, వంధత్వం మొదలైన సమస్యలకు చక్కని విరుగుడు. జింక్‌తోపాటు ఫైటోన్యూట్రియంట్స్ పుష్కలంగా ఉండే ఈ వేరు మెనోపాజ్ లక్షణాలను తొలగిస్తుంది.

# వ్యాయామం వద్దు!



వ్యాయామం ఆరోగ్యానికి అవసరమే! ప్రతి రోజూ అరగంటకు తగ్గకుండా వ్యాయామం చేయడం ద్వారా పలు రకాల ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ పొందవచ్చు. అయితే కరోనా సోకినవారి విషయంలో వ్యాయామం మేలు చేయకపోగా, మరింత చేటు చేస్తుందని ఓ అధ్యయనం ద్వారా తేలింది. జామా కార్డియాలజీలో ప్రచురితమైన ఈ అధ్యయనంలో జర్మన్ పరిశోధకులు... స్వల్ప కరోనా ఇన్‌ఫెక్షన్ సోకిన వారు తేలికపాటి వ్యాయామాలు చేసినా గుండె సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యాయామం చేయడం వల్ల కొవిడ్ లక్షణాలు పెరిగి, గుండె కండరాలు వాపుకు గురయ్యే మయోకార్డైటిస్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని వారంటున్నారు. ఈ అధ్యయనం కోసం కొవిడ్ నుంచి కోలుకున్న వంద మందికి కార్డియాక్ ఎమ్మారై పరీక్షలు జరిపినపుడు వీరిలో సగం మందికి స్వల్పం నుంచి మధ్యస్థంగా లక్షణాలు ఉండడం, 18 శాతం మందికి లక్షణాలేవీ లేకపోవడాన్ని వీరు గమనించారు. అయితే కొవిడ్ సోకినట్టు నిర్ధారణ అయినప్పటి నుంచి మూడు నెలల తర్వాత పరీక్షలు జరిపినప్పుడు వీరిలో ఎటువంటి గుండె సంబంధ సమస్యలు బయల్పడకపోయినా 78శాతం మంది గుండె ఆకారాల్లో తేడాలు తలెత్తడం, 60శాతం మందికి మయోకార్డైటిస్ ఉండడాన్ని పరిశోధకులు గమనించారు. దీన్నిబట్టి కరోనా వైరస్ గుండె కండరాల్లో తిష్ఠ వేసుకుని, గుండె ఏమాత్రం అలసటకు లోనైనా లోడ్ పెంచుకుని గుండెను దెబ్బ తీస్తుందనే నిర్ధారణకు వచ్చారు. వ్యాయామం చేసేటప్పుడు గుండె మీద ఒత్తిడి పెరిగి, గుండె కండరాల్లో వైరస్ సంఖ్య పెరుగుతుంది. ఈ వైరల్ లోడ్ పెరిగినప్పుడు మయోకార్డైటిస్, అరిథ్మియాస్, హార్ట్ ఫెయిల్యూర్‌కు దారితీయవచ్చు.

ఆ.వెలి.

తెలుగుబిడ్డ కదనదీక్షతో స్థిరుడౌచు<br>
అసువు బాసి కల్నలమరుడయ్యె<br>
అంజలించె దేశ<br>
మశ్రుతప్తయగుచు<br>
తెలిసిమెలగుమయ్య!<br>
తెలుగువాడ!




– మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769

ఒక్క చెప్పు...?? (ఒక అద్భుతమైన సంఘటన.) భారతదేశపులి మొట్టమొదటి ప్రైవేట్ యూనివర్సిటీ ఏది...? బెనారస్ హిందూ యూనివర్సిటీ! దాన్ని ఎవరు స్థాపించారు? మదన్ మోహన్ మాలవీయ ఆయన దీనిని విరాళాలు సేకరించి కట్టించారు...! ఆయన్ని చాలా మంది "నువ్వు మదన్ మోహన్ మాలవీయవి కావు బాబూ. నువ్వు మనీ మేకింగ్ మెషీన్ వి" అని హాస్యమాడేవారు కూడా...! అంత ఓపిగ్గా, పట్టుదలగా ఆయన విరాళాలు సేకరించేవారు. ఇదే క్రమంలో ఆయన నిజాం దగ్గరకి వెళ్లారు. నిజాం మహా పిసినారి. పైపెచ్చు మహా మత దురహంకారి...! " నీకెంత ధైర్యం...హిందూ యూనివర్సిటీ కోసం నేను విరాళం ఇవ్వాలా" అంటూ తన చెప్పును విసిరేశాడు కోపంగా... మాలవీయ మారు మాట్లాడలేదు...! ఆ చెప్పును కళ్లకద్దుకుని "మహా ప్రసాదం" అంటూ బయటకి వచ్చేశాడు. బాగా రద్దీగా ఉన్న కూడలిలో నిజాం చెప్పుని ఉంచి, దాన్ని అమ్మకానికి పెట్టాడు. నిజాం ప్రభువు చెప్పును కొనేందుకు జనం ఎగబడ్డారు...! పోటీ పెరిగింది. వేలం మొదలైంది. ఈ సంగతి నిజాం చెవిన బడింది. నవాబుగారి చెప్పు తక్కువకి వేలం పోతే పరువునష్టం. ఆ చెప్పు మాలవీయ చేతికి ఎలా వచ్చిందో తెలిస్తే సర్వభ్రష్టం...! ఆ చెప్పును ఏ బిచ్చగాడో వేసుకుంటే ప్రతిష్ఠ మూసీ పాలు!!! అందుకే నిజాం ప్రభువు తన సేవకుల్ని పిలిచి "ఎంత ధరైనా ఫరవాలేదు. నా చెప్పును కొని తీసుకురండి" అని పురమాయించాడు...! చివరికి భారీ ధరకు తన చెప్పును తానే కొనుక్కున్నాడు నిజాం నవాబు. నిజానికి నిజాం తన చెప్పుతో తానే కొట్టుకున్నాడు...! మాలవీయ గారు నిజాం లాంటి వాడి నుంచి కూడా "తివిరి ఇసుమున తైలమ్ము తీయవచ్చు" అని నిరూపించారు...! జీవితమూ నిజాం నవాబు లాంటిదే. అది ఒక చెప్పే విసిరేస్తుంది. మనమూ లిమదన్ మోహన్ మాలవీయ లాగా ఆ అరకొర అవకాశాన్ని కూడా వాడుకుంటామా లేదా అన్నదే అసలు ప్రశ్న!!! అన్నట్టు...మన దేశపు ధ్యేయవాక్యం "సత్యమేవ జయతే" ని ఆధునిక కాలంలో మొట్టమొదటగా ఉపయోగించిందీ మదన్ మోహన్ మాలవీయ గారే...!



– నగేష్ వర్మ, విశాఖపట్నం



# శివరాత్రి జాగారంలో డాన్ శీను పాట..

గోపిచంద్ మలినేని-రవితేజ కాంబినేషన్ అంటే బలుపు, డాన్ శీను వంటి మాస్ ఎంటర్టైనర్ చిత్రాలు గుర్తుకు వస్తాయి. ఈ రెండు చిత్రాలు మాస్ మహారాజ్‌కు మంచి మైలేజ్ఇచ్చాయి. అటు హీరోగా రవితేజకు, ఇటు దర్శకుడిగా గోపీచంద్ మలినేనికి మంచి పేరును తీసుకొచ్చాయి. ఇప్పుడు ముచ్చటగా మూడో సారి కూడా ఓ ప్రాజెక్ట్‌ను రెడీ చేశారు. అసలే వరుస ఫ్లాపుల్లో ఉన్న రవితేజను గట్టెక్కించడానికి క్రాక్ చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. నేటికి డాన్ చిత్రం విడుదలై.. పదేళ్లు కావొస్తోంది. ఈ మేరకు డాన్ శీను చిత్రం గురించి దర్శకుడు, పాటల రచయిత నాటి విశేషాలను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. పదేళ్ల డాన్ శీనుపై గోపీచంద్ మలినేని స్పందిస్తూ.. మై డియర్ మాస్ మహారాజ్ రవితేజ మీరు డైరెక్టర్‌గా నాకు జన్మను ఇచ్చారు. ఎప్పుడూరుణపడే ఉంటాను. నా జీవితాంతం డాన్ శీను చిత్రం ప్రత్యేకంగా గుర్తుండిపోతుంద'ని ట్వీట్ చేశాడు. ఇక పాటల రచయిత రామ జోగయ్యశాస్త్రి ఈ చిత్ర విశేషాల గురించి చెబుతూ చేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతోంది. గుర్తుందా గోపీ..మణిశర్మ అన్నయ్యతో కంపోజింగ్..శివరాత్రి జాగారంలో ఒక పాట పూర్తి చేశాం...డాన్ శీను వచ్చి అప్పుడే 10 ఏళ్లయిందా అంటూ రామ జోగయ్య ట్వీట్ చేయగా.. ఎలా మరిచి పోతాం శాస్త్రి గారు!! అడుగడుగున నాతో ఉన్నందుకు సదా కృతజ్ఞుడిని అంటూ గోపీచంద్ రిప్లై ఇచ్చాడు. ఇక అభిమానులు మాత్రం క్రాక్ సినిమా కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

# ఎవరితో పోటీ లేదు



తెలుగు , తమిళ , హిందీ చిత్రాలతో తమన్నా తన అందం , అభినయం తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. కొన్ని మూవీస్ లో స్పెషల్ సాంగ్స్ తో తమన్నా ప్రేక్షకులను అలరిస్తున్నారు. లాక్ డౌన్ సమయంలో సోషల్ మీడియా లో యాక్టివ్ గా ఉంటూ ఫొటోస్ , వీడియోస్ షేర్ చేస్తూ తన జీవిత విశేషాలను తమన్నా అభిమానులతో పంచుకుంటున్నారు. తమన్నా ప్రస్తుతం స్పోర్ట్స్ డ్రామా "సీటీ మార్ " మూవీలో కబడ్డీ కోచ్ గా నటిస్తున్నారు. ఒక హిందీ మూవీ లో కూడా నటిస్తున్నారు. చిత్ర పరిశ్రమలో పోటీ గురించి తమన్నా స్పందించారు. తమన్నా మాట్లాడుతూ .. ఏ చిత్ర పరిశ్రమలో నైనా చాలామంది ట్యాలెంటెడ్ కథానాయికలు వస్తూనే ఉంటారని , చిత్ర పరిశ్రమలో తనకు ఎవరితో పోటీ లేదని , ఎవరైనా తనకు పోటీ వస్తారనే ఆలోచనే తనకు ఉండదని , టాలీవుడ్ లో కాజల్ అగర్వాల్ , సమంత , అనుష్క అందరం స్నేహితులమే నని , మాలో ఎవరి సినిమా విజయం సాధించినా అందరం ఆస్వాదిస్తామని, పోటీ అనేదానికి మా మధ్య చోటే ఉండదని తమన్నా చెప్పారు. స్టార్ హీరోయిన్ తమన్నా నటించిన బాలీవుడ్ సూపర్ హిట్ "క్వీన్ " మూవీ తెలుగు రీమేక్ "దటీజ్ మహాలక్ష్మి " మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది.

# శౌర్య సరసన కేతిక శర్మ





తొలి సినిమా రొమాంటిక్ ఇంకా విడుదల కాకపోయినా, అప్పుడు టాలీవుడ్ దృష్టిని ఆకర్షించేసింది హీరోయిన్ కేతిక శర్మ. ఎంతయినా డైరక్టర్ పూరి జగన్నాథ్ సెలక్షన్, ప్రెజెంటేషన్ ఆ రేంజ్ లో వుంటుంది కదా? అందుకే అసలే సరైన హీరోయిన్ల కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ దృష్టి కేతిక శర్మ మీద పడింది. ఏస్ డిస్ట్రిబ్యూటర్ ఆసియన్ సునీల్ నిర్మాతగా మారి హీరో నాగశౌర్యతో సంతోష్ జాగర్లమూడి డైరక్షన్ లో నిర్మించే సినిమాకు కేతిక శర్మను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. విలువిద్య నేపథ్యంలో తయారయ్యే ఈ సినిమా కోసం నాగశౌర్య డిఫరెంట్ గెటప్ ట్రయ్ చేస్తున్నాడు. పైగా సిక్స్ ప్యాక్ కూడా చేసాడు. కరోనా కల్లోలం ముగియగానే సెట్ మీదకు వెళ్లే ఈ సినిమాలో కాస్త గట్టి స్టార్ కాస్ట్ ప్యాడింగ్ వుంది. కేతిక శర్మ నటించిన రొమాంటిక్ సినిమా ఆల్ మోస్ట్ పూర్తయింది. లాక్ డౌన్ అయిపోతే, ఈ సినిమాను ఫినిష్ చేసి వీలయినంత త్వరగా విడుదల చేసే ఆలోచనలో వున్నారు నిర్మాతలు పూరి-చార్మి. ఆ సినిమా లో బాగా అందాలు ఆరబోసింది కేతిక శర్మ. అది విడుదలయితే శౌర్య సినిమాకు అడ్వాంటేజ్ అవుతుంది.

# మెగా మేనల్లుడికీ ఓ లవ్‌స్టోరీ వుంది!



టాలీవుడ్‌లో ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. ఓ పక్క కరోనా ఉధృతి కనసాగుతున్నా టాలీవుడ్‌లో మాత్రం పెళ్ళిళ్లు ఆగడం లేదు. దిల్ రాజు నుంచి డైరెక్టర్ సుజిత్ వరకు ఇప్పటి వరకు ఐదారు జంటలు పెళ్లి పీటలెక్కేశాయి. త్వరలో అంటే ఈ నెల 8న దగ్గు బాటి రానా కూడా వివాహం చేసుకోబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ నెక్ట్స్ మెగా మేనల్లుడు సాయి ధరమ్‌తేజ్ వంతే అంటూ చర్చించుకుంటున్నారు. ఇదిలా వుంటే తన కాలేజీ డేస్ లవ్ స్టోరీని రివీల్ చేసి సాయిధరమ్ తేజ్ షాకిచ్చారు. చిత్రలహరి సినిమాతో మళ్లీ విజయాల బాట పట్టిన సాయి ధరమ్ తేజ్ ప్రతీరోజు పండగే సినిమాతో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకుని మాంచి జోరుమీదున్నారు. 33 ఏళ్ల ఈ మెగా హీరో పెళ్లిపై గత కొంత కాలంగా చర్చ జరుగుతోంది. తను ప్రేమించిన యువతిని పరిచయం చేస్తారా ? లేక నితిన్, నిఖిల్ తరహాలోనే ఎంగేజ్‌మెంట్ అంటూ షాకిస్తారా? అని అంతా చర్చించుకుంటున్నారు. ఇదిలా వుంటే సాయిధరమ్‌తేజ్ మాత్రం తన కాలేజీ రోజుల్లో ప్రేమని గుర్తు చేసి ఆశ్చర్యపరిచారు. తన జీవితంలోనూ ప్రేమదేశం లాంటి లవ్ స్టోరీ వుందని, అందులో చాలా ట్విస్టులున్నాయని చెప్పి షాకిచ్చారు. తను ప్రేమించిన అమ్మాయిని తన ఫ్రెండ్ కూడా లవ్ చేశాడని, ఆ తరువాత విషయం తెలిసి ఇద్దరం గొడవ పడ్డామని, కానీ తాము ప్రేమించిన అమ్మాయి కాలేజీ వదిలి వెళ్లిపోయిందని, ఆ తరువాత ఇద్దరం కలిసి బాధపడ్డామని షాకిచ్చాడు సాయిధరమ్ తేజ్.



# తెల్ల చీరలో అనసూయ సోయగాలు

తెల్ల చీరకు సరిగమ పదనిస.. అనే ఓ అద్భుతమైన పాట ఉందని తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆ పాటలో శ్రీదేవీ అందాలకు ఫిదా కానీ తెలుగు వారెవ్వరూ ఉండరు. అదే విధంగా ప్రస్తుతం అనసూయ షేర్ చేసిన ఫోటోలకు కూడా ఫిదా కానీ వారెవ్వరూ ఉండరు. నిత్యం ఫోటో షూట్లతో హల్చల్ చేసే అనసూయ.. ఈ సారి వెరైటీ చీరలో దర్శనమిచ్చింది. ఆ మధ్య లాక్ డౌన్ చీరతో నెటిజన్లను చుట్టేసిన అనసూయ.. మళ్లీ ఇలా దర్శనమిచ్చింది.బుల్లితెర, వెండితెర అనే సంబంధం లేకుండా అనసూయ కనబడితే ఆ రేంజ్ మారుతుంది. అందంతోనే కాదు నటనతోనూ లక్షలాది మంది అభిమానులను సంపాదించుకుంది అనసూయ. రంగమ్మత్తగా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. సోషల్ మీడియాలోనూ అనసూయ చేసే రచ్చ అంతా ఇంతా కాదు. నిత్యం ఏదో ఒక ఫోటో షూట్ చేయడం, ఫోటోలతో నెటిజన్ల ఆకట్టుకోవడం వంటివి చేస్తూనే ఉంటుంది.అయితే అనసూయకు ఎలాంటి డ్రెస్ వేసినా ఇట్టే నప్పుతుంది. మోడ్రన్ డ్రెస్సులైనా సరే, సంప్రదాయ వస్త్రాలైనా సరే అనసూయ ధరిస్తే వచ్చే అందమే వేరు. అనసూయ చీర కడితే మాత్రం కుర్రకారు ఫిదా అవ్వాల్సిందే. ఆ మధ్య లాక్ డౌన్ సమయంలో లైవ్‌లోకి వచ్చిన అనసూయ చీరలో దర్శనమిచ్చింది. ఆ సమయంలో బయటపడ్డ నాభి అందాలు నెట్టింట పెద్ద చిచ్చునే పెట్టింది.లాక్ డౌన్ తరువాత మళ్లీ షూటింగ్ మొదలెట్టగా అనసూయ మాత్రం కొత్త కొత్తగా రెడీ అవుతోంది. జుట్టు వెరైటీగా కత్తిరించుకుంది, వింత వింత రంగులు వేసుకుని పరదేశీ పిల్లలా తయారైంది. ఆ సమయంలో అనసూయ ఫోటోలపై విపరతీమైన ట్రోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గా అనసూయ చిన్న పిల్లలా మారి బుల్లి స్కర్ట్, పొట్టి టీ షర్ట్ ధరించిన ఫోటోలు ఎంతగానో వైరల్ అయ్యాయి.

# ఆయన దు:ఖంను చూస్తే గుండె బద్దలవుతోంది : మీరా చోప్రా




సుశాంత్ రాజ్‌పూత్ మృతి కేసు మలు పులు తిరుగుతూ చర్చనీయాంశంగా మారింది. ముంబయి పోలీసులు విచారణ జరిపినన్ని రోజులు ఆయనది ఆత్మహత్యగా అంతా అనుకున్నారు. ఆఫర్లు లేక డిప్రెషన్ తో చనిపో యాడేమో అనుకున్నారు. కాని ఎప్పుడైతే సుశాంత్ తండ్రి కేకే సింగ్ బీహార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడో అప్ప టి నుండి రియా చక్రవర్తి గురించిన అను మానాలు వ్యక్తం అవుతున్నాయి. కేకే సింగ్ మూడు రోజుల క్రితం విడుదల చేసిన ఒక వీడియోలో ఆయన ఆవేదన వ్యక్తం చేయ డంతో చాలా మంది సుశాంత్ కేసు విష యంలో న్యాయం జరగాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఫిబ్రవరిలోనే ముంబయి పోలీసులకు తాను సుశాంత్ గురించి చెప్పాను. ఆ సమయంలోనే రియాపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేస్తే వారు పట్టించుకోలేదు అంటూ కేకే సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ వీడియోలో ఆయన కన్నీరు పెట్టుకోవడంపై హీరోయిన్ మీరా చోప్రా స్పందించింది. 74 ఏళ్ల ఒక వృద్ధ తండ్రి తన కొడుకును కోల్పోయాడు. ఈ సమయంలో ఆయన తనకు న్యాయం కావాలని కోరుతున్నారు. కొడుకును ఎలాగూ పొందలేరు. కనీసం ఆయన న్యాయం అయినా పొందలేరా అంటూ ఆమె ప్రశ్నించింది. ఆమె ట్వీట్ వైరల్ అయ్యింది. సుశాంత్ కేసు ఇప్పుడు సీబీఐకి చేరింది. కేంద్ర ప్రభుత్వంకు బీహార్ సీఎం సిఫార్సు చేయడంతో సీబీఐకి కేసును అప్పగిస్తున్నట్లుగా కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ముంబయి పోలీసులు వ్యవహ రించిన తీరు పలు అనుమానాలకు తావు ఇచ్చింది. ఇప్పుడు సీబీఐకి కేసు చేరడంతో సుశాంత్ మృతిపై ఉన్న అనుమానాలకు సమాధానం లభిస్తుందని అభిమానులు మరియు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

# యాంకరింగ్ స్టార్ట్ చేసిన సమంత...!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అక్కినేని సమంత కరోనా సమయంలో సాధారణ గృహిణిగా మారిపోయింది. తన భర్త నాగచైతన్యతో కలిసి ఇంట్లోనే ఉన్న సమంత తనకు దొరికిన ఈ ఖాళీ సమయాన్ని ఎంతో చక్కగా వినియోగించుకుంటోంది. ఈ క్రమంలో అర్బన్ ఫార్మింగ్ చేస్తూ అనేకమందికి స్ఫూర్తిగా నిలిచింది. ఇటీవల తన టెర్రస్ వెజిటబుల్ గార్డెన్ ను అభిమానులకు పరిచయం చేసిన సామ్ 'మనకు కావాల్సిన ఆహారాన్ని మనమే ఎందుకు పండించుకోకూడదు అనే ఆలోచనతో నేను స్వయంగా అర్బన్ వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నానని' చెప్పుకొచ్చింది. సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ పండించిన కూరగాయల గురించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ వచ్చింది. ఈ క్రమంలో సమంత ఈ అర్బన్ ఫార్మింగ్ విధానాన్ని అందరికి తెలియజేయాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది.కాగా సమంత తన టెర్రస్ పై గార్డెనింగ్ ఏర్పాటు చేసుకున్నట్లే అందరూ చేస్తే బాగుంటుం దని భావించి 'జీరో బడ్జెట్ గార్డెనింగ్' గురించి తెలియజేయాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో కొంతమందిని ఇంటర్వ్యూ చేసి అర్బన్ ఫార్మింగ్ గురించి వెల్లడించనుంది. తాజాగా తన ఇన్స్టాగ్రామ్ టీవీ ద్వారా చేసి సక్సెస్ 'జీరో బడ్జెట్ గార్డెనింగ్ - ఎలా ఎందుకు?' అనే పేరుతో భార్గవి అనే అర్బన్ ఫార్మర్ ని ఇంటర్వ్యూ చేసింది. ఈ సందర్భంగా అర్బన్ ఫార్మింగ్ చేయడానికి ఆమెను ప్రేరేపించిన అంశాలు.. స్టార్టింగ్ లో ఆమె ఎదుర్కున్న సమస్యలు.. వాటిని ఎలా అధిగమించాలి అనే విషయాలను తన ఫాలోవర్స్ కి సామ్ తెలియజేసింది. సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించే ప్రాచు ర్యం పొందిన ఎందరో వ్యక్తులను రాబోయే రోజుల్లో సమంత ఇంటర్వ్యూ చేయనున్నట్లు తెలుస్తోంది.

# సౌందర్య రహస్యం బాహాటంగా చెప్పేసిన బ్యూటీ



టాలీవుడ్ లో ప్రస్తుతం రష్మిక మందన్న టాప్ స్టార్ హీరోయిన్‌గా వరుస చిత్రా లను చేస్తోంది. ఈ ఏడాదిలో ఈమె రెండు సినిమాలతో వచ్చింది. ఆ రెండు సినిమాలు సరిలేరు నీకెవ్వరు మరియు భీష్మ మంచి విజయాన్ని సొంతం చేసు కున్నాయి. ఈ ఏడాదిలో కనీసం ఒక్క సినిమా కూడా విడుదల చేయలేక పోయిన హీరోయిన్స్ ఉన్నారు. అలాం టిది కరోనా ఇయర్‌గా ముద్రపడ్డ 2020 లో రష్మిక రెండు సినిమాలతో సక్సెస్ దక్కించుకోవడంతో పాటు ప్రస్తు తం పుష్ప వంటి భారీ పాన్ ఇండియా సినిమా చేతిలో ఉంది. తమిళంలో కూడా మంచి ఆఫర్లు ఈ అమ్మడికి ఉన్నాయి. అభినయం మరియు అందంతో అలరించే ఈ అమ్మడు ఇటీ వల ఒకానొక సందర్భంలో తన సౌం దర్య రహస్యం గురించి ఆసక్తికర వ్యా ఖ్యలు చేసింది. తాను గతంలో ఇంత అందంగా ఉండేదాన్ని కాదు. నాకు ఎప్పుడు ఏదో ఒక చర్మ సమస్య ఉండేది. దాంతో చర్మ పాలి పోయినట్లుగా ఉండటంతో పాటు జీవం కోల్పోయినట్లుగా నా చర్మం కనిపించేది. ఆ సమయంలో నేను చర్మంకు సంబధించిన పరీక్షలు చేయించగా నాకు స్కిన్ ఎలర్జీ ఉన్నట్లుగా గుర్తించారు. అప్పటి నుండి స్కిన్ ఎలర్జీ కి కారణం అయ్యే అన్ని ఆహారపు పదార్థాలను వదిలేశాను. అప్పుడు వదిలేసిన ఆ ఆహార పదార్థాలు మళ్లీ ఇప్పటి వరకు ముట్టుకోలేదు. ఎంతో ఇష్టం అయిన కొన్ని డిషెష్ ను వదిలి పెట్టినందుకు ఇప్పటికి బాధగానే ఉంటుందని రష్మిక తన చర్మంకు సంబంధించిన రహస్యంను చెప్పుకొచ్చింది.



# వచ్చే ఏడాది వరకు వెయిట్ చేయాల్సిందేనన్న ఆలియా

రాజమౌళి ఏ సినిమా చేసినా కూడా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తాడు. సినిమా క్వాలిటీ విషయంలో రాజీ పడకపోవడం వల్ల విడుదల ఆలస్యం అవుతాయేమో కాని సినిమా రీ షూట్ చేయడం లేదంటే హీరో హీరోయిన్ కోసం వెయిట్ చేయడం వంటివి జరుగవు. కాని ఈసారి మాత్రం ఆయనకు కొత్త కొత్త సమస్యలు వస్తున్నాయి. మల్టీస్టారర్ అవ్వడంతో పాటు బాలీవుడ్ హీరోయిన్ ను హీరోను నటింపజేయడం మరియు హాలీవుడ్ నటిని ఎన్టీఆర్ కు జోడీగా నటింపజేయాల్సి రావడంతో జక్కన్న నటీనటుల డేట్ల విషయంలో ఈసారి ఇబ్బంది పడుతున్నాడు.కరోనా కారణంగా ఆగిపోయిన సినిమా షూటింగ్ ను మొదలు పెట్టాలనుకున్నా హీరోలు మరియు హీరోయిన్స్ డేట్ల విషయంలో తేడా కొడుతోంది. వచ్చే ఏడాది వరకు డేట్లు ఇవ్వలేను అంటూ ఆలియా భట్ తేల్చి చెప్పిందట. ఈ ఏడాది చివర్లో సినిమాను పట్టాలెక్కించాలుకున్న జక్కన్నకు ఇద్దరు హీరోయిన్స్ తో కూడా సమస్యగా ఉంది. ఓలివియా మరో దేశం నుండి రావాల్సి ఉంది. కనుక ఆమె రాకకు సమస్యగా ఉంది. ఇక ఆలియా కూడా 2021 వరకు కెమెరా ముందుకు రానంటూ తనకు తానుగా గిరి గీసుకుని ఉందట. ఆలియా మరియు చరణ్ ల కాంబోలో కీలక సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉందట. అలాగే సినిమాకు సంబంధించిన ఒక కీలక పాటను కూడా ఆమెపై చిత్రీకరించాల్సి ఉందట. దాంతో ఆమె వచ్చే వరకు షూటింగ్ ప్రారంభించడం కష్టమే అన్నట్లుగా జక్కన్న ఉన్నాడు. ఈ ఇబ్బందులల్లో షూటింగ్ మొదలు పెట్టే కంటే వచ్చే ఏడాది కరోనా అంతా కనుమరుగు అయిన తర్వాత షూటింగ్ మొదలు పెడితే బాగుంటుందనే అభిప్రాయానికి జక్కన్న వస్తాడేమో చూడాలి.

# తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు

## ఓ.సి సంఘం మహిళా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 9 :** ఓ.సి సంగం లోని మహిళా విభాగానికి విజయవాడ తూర్పు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా కృష్ణలంకకి చెందిన మేకల విజయలక్ష్మిని మరియు బుల్లెమ్మని నియోజకవర్గ మహిళా కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మేకల విజయలక్ష్మి గారి నివాసంలో ఏర్పాటు చేసిన ఓ.సి సంగం సమావేశంలో మహిళా విబాగాన్ని ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు విజయలక్ష్మి బుల్లెమ్మలు మాట్లాడుతూ ప్రతికులంలో పేదలు ఉన్నారని వారందరిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని తెలిపారు. అగ్రకులాల్లోని తెల్లకార్డు కలిగిన ప్రతి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నా మీద విశ్వాసంతో మాకు ఓ సి సంగం మహిళా నాయకులుగా ఎంపిక చేసిన ఓ.సి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బా రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఓ.సి సంగం నాయకులు షేక్ లక్ష్మి ,అనిల్, సునీత, నల్లగుట్లరాధ ,గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రిష్ణా జిల్లా అధ్యక్షుడుగా ఆదెర్ల వెంకటరెడ్డి



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 9 :** ఓ.సి సంగం లోని అనుబంధ విభాగం అయిన యువజన విభాగానికి క్రిష్ణా జిల్లా యువజన శాఖ అధ్యక్షుడుగా నందిగామ మండలం ,చెరువుకొమ్మ పాలెం గ్రామానికి చెందిన అందెర్ల వెంకటరెడ్డిని ఎంపిక చేయటం జరిగిందని వెంకట రెడ్డి విజయవాడ లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నియామకం ఓసి సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బారెడ్డి గారు ఈమెయిల్ ద్వారా పంపినారని తెలిపారు. నాకు ఈ పదవి రావడానికి సహకరించిన ఓ.సి సంగం నాయకులు గౌతమ్ రెడ్డి, షేక్ లక్ష్మి, విద్యార్థి నాయకుడు అనిల్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .ఈ సందర్బంగా నూతనంగా ఎంపిక కాబడిన యువజన శాఖ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్రప్రభుత్వం నిర్వహించే ప్రతి ఉద్యోగ నియామకాలలో ఓ.సి అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. నా మీద విశ్వాసంతో నన్ను నియమించిన రాష్ట్ర నాయకులు కందనూరు వెంకట సుబ్బారెడ్డి గారికి రుణపడి ఉంటానని పత్రికాముఖంగా తెలిపారు.

## ప్రశ్నాపత్రాల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



**చిత్తూరు, వార్తావళి, సెప్టెంబర్ 9 :** చిత్తూరు, సచివాలయ ఉద్యోగాలకు సంబంధించి జరగనున్న పరీక్షల ప్రశ్నాపత్రాలు రెండు మూడు రోజుల్లో రానున్నాయని ప్రశ్నాపత్రాలను పెంచడానికి ఏర్పాట్లతో పాటు ఇక్కడ ఏర్పాటు చేసిన సిబ్బంది వారికి కావాల్సిన సదుపాయాలను మున్సిపల్ శాఖ వారు చేయాలని జాయింట్ కలెక్టర్( అభివృద్ధి) వీరబ్రహ్మం అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం పక్కన ఉన్న హైస్కూల్లో ఏర్పాటుచేసిన ప్రశ్నాపత్రాల కు సంబంధించిన స్ట్రాంగ్ రూము ను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ తోపాటు ఏర్పాటుచేసిన రాక్ లను రాంగ్ రూమ్ చుట్టూ తీసుకున్న భద్రతా చర్యలు సీసీ కెమెరాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఇన్చార్జి సీఈవో ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ విశ్వనాధ డివిజినల్ ఇంజనీర్ రమణ డి పి ఆర్ సి కోఆర్డినేటర్ షణ్ముగం తదితరులు ఆయనతో ఉన్నారు. ప్రశ్నపత్రాల కోసం ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ చుట్టూ పటిష్టమైన భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించిన జాయింట్ కలెక్టర్ వారికి కావాల్సిన ఏర్పాట్లు మున్సిపల్ శాఖ వారు చేయాలని ఆదేశించారు.

## 27వ రేషన్ షాపు ముందు రేషన్ కార్డు దారుల పడిగాపులు



**మైదకూరు, వార్తావళి, సెప్టెంబర్ 9 :** కడప జిల్లా మైదుకూరు పట్టణంలోని 27వ రేషన్ షాప్ పరిధిలో... గత మూడు నెలలుగా రేషన్ బియ్యం అందని రేషన్ కార్డు దారులు ఈసారైనా రేషన్ బియ్యం అందుతాయో లేదో అన్న అభద్రతా భావంతో రేషన్ షాప్ ముందు పడిగాపులు కాస్తున్నారు. గత మూడు నెలల నుండి 27వ రేషన్ షాప్ పరిధిలోని 50 శాతం కార్డుదారులకు రేషన్ సరుకులు అందడం లేదని అధికారులపై మండిపడుతున్నారు. రేషన్ పంపిణీ పై వస్తున్న ఆరోపణలపై మండల తాసిల్దార్ ప్రేమంత్ కుమార్ ను వివరణ కోరగా... పూర్తిస్థాయిలో రేషన్ కోట అలాట్మెంట్ జరగక పోవడం వల్లనే సమస్యలు తలెత్తుతున్నాయని, త్వరలోనే సమస్య పరిష్కారమవు తుందని తెలిపారు. దీన్ని బట్టి చూస్తే 27వ షాపు పరిధిలోని రేషన్ కార్డు దారులలో చాలామందికి ఈ నెల కూడా (11వ విడత) రేషన్ సరకులు అందే పరిస్థితి లేదని అర్థమవుతుంది.

## తిరుపతిలో భూ -కబ్జాలను అరికట్టాలి

### టిడిపి మాజీ నగర అధ్యక్షులు ఆర్.సి.మునికృష్ణ




**తిరుపతి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** తిరుపతి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుగుణ ఆదేశాల మేరకు నగరంలో భూకబ్జాలు, అల్లరి మూకలు వల్ల తిరుపతి ప్రశాంతతని కోల్పోకూడదు అని వాటిని అరికట్టాలని బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న గాంధి విగ్రహం ముందు తిరుపతి తెలుగుదేశం విగ్రహం దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆర్.సి.మునికృష్ణ, మస్తాన్ నాయుడు, దామోధరం లు మాట్లాడుతూ ఈ భూ -కబ్జాల వెనుక ఎంతటివారినైనా గాని కఠినంగా శిక్షించా, వారిపై నాన్ - బెయిలబుల్ కేసులు పెట్టి ఉక్కుపాదం మోపాలి అని జిల్లా పోలీసు ఉన్నతాధికారులును కోరారు. మొన్న జరిగిన భూ కబ్జా విషయంలో నిందుతులను అరెస్టు చేసి రిమాండుకు పంపించిన తిరుపతి ఎస్పీ ఆవుల రమేష్ రెడ్డి కి, పోలీసు అధికారులకు తెలుగుదేశం పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ భూకబ్జాలును వెనక నుండి నడిపిస్తున్న వారిని కూడా అరెస్టు చేసి ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.సి.మునికృష్ణ, మస్తాన్ నాయుడు, దామోధరం, మనోహరాచారి, సుధాకర్ రెడ్డి, మైనం బాలాజి, రాజయ్య, చంద్రమోహన్, వెంకటేష్, జయరామిరెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తినే ఐస్ క్రీమ్‌లో డ్రగ్స్.. మంత్రి సంచలనం



కర్ణాటక రాష్ట్రంలో ప్రస్తుతం డ్రగ్స్ వ్యవహారం సంచలనంగా మారింది. సినీ పరిశ్రమకు చెందిన పలువురికి ఇందులో సంబంధాలు ఉన్నట్లుగా పెద్ద ఎత్తున ఆరోపణలు రావటమే కాదు.. ఇప్పటికే కొందరిని అరెస్టు చేయటం హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగం పెరగటం.. అందులో సినీ పరిశ్రమకు చెందిన వారు ఉండటంతో ఈ వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేస్తుంది. మాదక ద్రవ్యాల్ని రవాణా చేస్తున్న ఆరోపణలపై కన్నడ నటి రాగిణి ద్వివేది అరెస్టు కావటం పలువురిని విస్మయానికి గురి చేసింది. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో వేళ్లూరుకుంటున్న డ్రగ్స్ వ్యాపారంపై యడ్డీ సర్కారు సీరియస్ గా ఉంది. దీని అంతు చూడాలన్నట్లుగా ఉన్నట్లు చెబుతున్నారు. అంతేకాదు.. డ్రగ్స్ వ్యవహారంపై ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి యడ్డీ అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీనికి హోంమంత్రితో పాటు.. పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రత్యేకంగా టీముల్ని ఏర్పాటు చేసి డ్రగ్స్ వ్యాపారంపైనిఘా పెంచాలని నిర్ణయించారు. ఇదిలా ఉంటే.. కర్ణాటక మంత్రి సురేశ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు మహానగరంలోని పలు డ్రగ్స్ ముఠాలు పాఠశాలల వద్ద ఐస్ క్రీముల్లో మత్తుమందు కలిపి విద్యార్థుల్ని టార్గెట్ చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న సంపన్న పిల్లల్ని లక్ష్యంగా ఈ కుట్ర జరుగుతుందని ఆరోపించారు. దీంతో.. కర్ణాటక విద్యాశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెన సంచలనంగా మారాయి.

## కిరాణా లబ్దిదారులకు శిక్షణా

**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 9 :**కలక్టర్ ఆదేశాలుమేరకు శ్రీ జె. వెంకటరావు గారు, జాయింట్ కలక్టర్ (ఆసరా) మరియు శ్రీ కె. సుబ్బారావు, ప్రాజెక్ట్ డైరక్టర్, డి.ఆర్.డి.ఏ వారి ఆధ్వర్యంలో కంపెనీల యొక్క ప్రతినిధుల ద్వారా వై.ఎస్.ఆర్ చేయూత కిరాణా లబ్దిదారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ప్రతీమండలం నుంచి 1 పాత లబ్దిదారు మరియు 1 కొత్త లబ్దిదారుని కలిపి మొత్తం 2 వై.ఎస్.ఆర్ చేయూత కిరాణా లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగినది. పై శిక్షణా కార్యక్రమానికి 34 మండలాల నుంచి ఇద్దరు చొప్పున 68 మంది వై.ఎస్.ఆర్ చేయూత కిరాణా లబ్దిదారులు హాజరయ్యారు. వీరికి షాపు నిర్వహణ, అమ్మకాలు, బ్యాంకు రుణం పొందడం మరియు సుస్థిరత సాధించుటకు బిజినెస్ భాగస్వాములు అయినటువంటి 1) మొదలగు కంపెనీల వారిచే శిక్షణ ఇప్పించడం జరిగినది. తదనుగుణంగా రాబోయే రోజుల్లో వీరికి ముందుగా బ్యాంకు రుణం ఇప్పించి షాపులు ప్రారంభించడం జరుగుతుంది.

## పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కింది

**పెందుర్తి, వార్తావళి, సెప్టెంబర్ 9 :**గర్భిణీ స్త్రీలు ,బాలింతలు ,పిల్లలూ పౌష్టికాహార లోపం వల్ల రక్త హీనత తో బాధ పడుతున్నారు అని వీరందరికి అంగన్వాడీ కేంద్రం ద్వారా వై.ఎస్. ఆర్. సంపూర్ణ పోషణ పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కింది అని విశాఖ జిల్లా వై. ఎస్. ఆర్ పార్టీ మహిళ విభాగం జిల్లా కార్యదర్శి మీసాల విజయలక్ష్మి తెలియ చేశారు .పెందుర్తి మండలం, కృష్ణరాయపురం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో మీసాల విజయలక్ష్మి తన సొంత నిధులు తో పండ్లు ,స్వీట్లు, స్టీల్ కంచాలు,గ్లాసు లు అందచేశారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం కోసం పెందుర్తి శాసన సభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి సహాయ నిరాకరణ తో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నాం అన్నారు . అలాగే తాను కూడా జిల్లా లో ఉన్న అన్ని అంగన్వాడీ కేంద్రాలు సందర్శించి గర్భిణీ స్త్రీలు ,బాలింతలు ,పిల్లలకు పౌష్టికాహారాన్ని ,మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు అన్నారు.

## సకాలంలో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలి

### కమిషనర్ గిరీషా



**తిరుపతి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలు నిర్ణయించిన సమయానికి పరిష్కరించాలని కమిషనర్ గిరీషా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందిస్తున్న 534 సేవలకు సంబంధించి వచ్చిన వివిధ దరఖాస్తుల పరిష్కారంపై ఆయా విభాగాధిపతులతో బుధవారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఆన్లైన్ లో పెండింగులో ఉన్న దరఖాస్తులను విభాగాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ట్రేడ్ లైసెన్సు లు, టైటిల్ ట్రాన్స్ఫర్ వంటి అనేక సేవలకు సంబందించిన దరఖాస్తులు ఎందుకు పెండింగ్ ఉన్నాయని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వ సేవలకై దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. ఒక్కో సేవ పరిష్కారానికి ప్రభుత్వమే సమయం కేటాయించిందన్నారు. ఆ సమయం లోపు ఆ సేవలకు సంబంధించిన అధికారులు పరిష్కరించాలన్నారు. ఎవరి లాగిన్ లో అయితే పెండింగ్ లో ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మనం ఉన్నదే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకని, ఎవరికి వారు వెంటనే మీ లాగిన్ తనిఖీ చేసి పరిష్కరించాలన్నారు. ఏ సచివాలయం కు సంభందించిన వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి ఎంపిక, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ హరిత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, మేనేజర్ హాసిమ్, వైద్యాధికారిని సుధారాణి, సూపరింటెండెంట్ రవి, రెవిన్యూ ఆఫీసర్స్ సేతుమాదవ్, గాలి సుధాకర్, శానిటరీ సూపరువైజర్లు గోవర్ధన్, చెంచెయ్య, ఏ.సి.పి.లు శ్రీనివాసులు రెడ్డి, షణ్ముగం, మెప్మా రమణ, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో ఉప ముఖ్యమంత్రి పర్యటన




**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 9 :** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం ఎలా ఉంటుంది అని ఆయన చేస్తున్న పథకాల ద్వారా నిరూపితం అవుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. బుధవారం నాడు ఆయన తన సొంత నియోజకవర్గమైన గంగాధర నెల్లూరులో పర్యటించారు. ఈ సందర్భంగా గంగాధర్ నెల్లూరు మండలంలోని ,వెజ్జుపల్లి, పేడ కంటి పల్లి, పెద్ద గుంట పల్లి,కనుగొండ రాయ స్వామి ఆలయం వద్దకు, పాపిరెడ్డి పల్లి లలో సుమారు మూడు కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లను చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డప్ప తో కలసి ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. అదేవిధంగా వెజ్జుపల్లి లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన తండ్రి కన్నా కొంతైనా ఎక్కువ చేయాలని గతంలో చెప్పేవాడిని 16 నెలలు కాలంలో చెప్పిన హామీలను నెరవేర్చడం జరిగిందని అంతేగాక గ్రామ స్వరాజ్యం కోసం గ్రామ వార్డు సచివాలయ లను ఏర్పాటు చేయడం ప్రజల వద్దకే పరిపాలన తీసుకు పోయినట్లు ఉందని అందుకు మన జిల్లా మంత్రివర్యులు అయిన రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కృషి కూడా చెప్పుకోవాల్సి ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ ఆనంద్ రెడ్డి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నం రెడ్డి సింగిల్విండో చైర్మన్ బాబు రెడ్డి మాజీ జెడ్పిటిసి గుణశేఖర్ ఆర్డిఓ రేణుక ఎం డి ఓ శ్రీదేవితో పాటు పలువురు అధికారులు అధికారులు పాల్గొన్నారు.



కరోనా కేసులు విజృంభించి దాదాపు పట్టణంలో 200 కేసులు దాటినా సందర్భంలో మస్కులు లేకుండా వ్యాపారాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడుపుతున్న వారికి మొదటి సారిగా 50 రూ!! అపరాధ రుసుము విధించారు జ్యోతి బస్టాండ్ నందు 13 మందికి అపరాధం విధించినట్లు పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్ వెల్లడించారు 2 వ సారి మళ్ళీ ఇదేవిధంగా మస్కులు లేకుండా తిరుగుతూ, వ్యాపారాలు నిర్వహిస్తే భారీగా జరిమానా విడిస్తామని కరోనా కేసులను దృష్టిలో ఉంచుకొని మస్కులు అందరూ వేసుకోవాలని ప్రజలను కోరారు. - వార్తావళి, కొత్తకోట

## 21 నుంచి స్కూళ్లు ఓపెన్‌కు ఓకే.. కండీషన్స్



ఇటీవల కాలంలో యావత్ ప్రపంచం ఎప్పుడూ చూడని ప్రత్యేక పరిస్థితిని కరోనా తీసుకొచ్చింది. ఒకే సమయంలో ఒకే విధమైన సమస్యను మానవాళి ఎదుర్కోవటం ఇదే తొలిసారిగా చెబుతున్నారు. గతంలో వైరస్ కారణంగా ఇబ్బందులు తలెత్తినా.. ఇప్పటి మాదిరి కాదని చెప్పక తప్పదు. కరోనా నేపథ్యంలో లాక్ డౌన్ విధించటం.. తర్వాతి కాలంలో అన్ లాక్ పేరుతో సిరీస్ రన్ చేస్తున్న కేంద్రం.. తాజాగా కీలక ప్రకటన జారీ చేసింది. ఈ నెల 21 నుంచి స్కూళ్లు తెరిచేందుకు ఓకే చెప్పింది. కాకుంటే.. అందుకు అనుసరించాల్సిన విధివిధానాల్ని స్పష్టం చేసింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు ఆరోగ్య మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల్ని అన్ని రాష్ట్రాలు.. కేంద్రపాలిత ప్రాంతాలు పాటించాలని స్పష్టం చేశారు. కేంద్రం పేర్కొన్న మార్గదర్శకాల్ని విద్యార్థులు.. వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు.. స్కూల్ సిబ్బంది అందరూ పాటించాల్సి ఉంటుంది.

**విధివిధానాలు ఇవే..**

భౌతిక దూరానికి అమిత ప్రాధాన్యత. ఆరు అడుగు దూరం పాటించాల్సిందే. నోటిని కప్పి ఉంచే మాస్కును ఎల్లప్పుడు ఉపయోగించాల్సిందే తరచూ చేతుల్ని సబ్బుతో కానీ ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్ ను వినియోగించాలి తుమ్ము కానీ దగ్గు కానీ వచ్చినప్పుడు అయితే చేతిరుమాలు.. లేదంటే టిష్యూ పేపర్ ను వాడాలి వాడేసిన టిష్యూ పేపర్ ను కచ్చితంగా డస్ట్ బిన్ లో మాత్రమే వేయాలి. గతంలో మాదిరి ఉమ్మి వేయటం అన్నిచోట్ల కచ్చితంగా నిషేధం అమల్లో ఉండాలి ఆరోగ్య సేతు యాప్ ను వీలైనంతవరకు అందరు వాడాలి తొమ్మిది తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు అన్ని పాఠశాలల్ని ఏర్పాటు చేయాలి ఆన్ లైన్ విద్యా విధానాన్ని కూడా అమలు చేయొచ్చు. పాఠశాలలకు విద్యార్థుల్ని అనుమతించాలంటే.. వారి తల్లిదండ్రుల వద్ద తప్పనిసరిగా అనుమతి అవసరం కంటైన్ మెంట్ జోన్ లేని చోట్ల మాత్రమే స్కూళ్లను తెరుస్తారు కంటైన్ మెంట్ జోన్ లేని ప్రాంతాల్లోని విద్యార్థులు.. ఉపాధ్యాయులు.. స్కూలు సిబ్బందిని అనుమతించాలి స్కూళ్లు ఓపెన్ చేయటానికి ముందు స్కూల్ లోని అన్ని ప్రాంతాల్ని ఒక శాతం సోడియం హైపోక్లోరైట్ ద్రావణంతో క్లీన్ చేయాలి ఉపాధ్యాయులు.. విద్యార్థుల మధ్య దూరం 6 అడుగుల కంటే ఎక్కువగా ఉండేటా సీటింగ్ ఏర్పాటు చేయాలి క్వారంటైన్ కేంద్రాలుగా వినియోగించిన స్కూళ్లను మరింత ఎక్కువగా శుభ్రపర్చాలి. పాఠశాలల్లో 50 శాతం మాత్రమే భోదన.. బోధనేతర సిబ్బందిని పిలువాలి. స్కూళ్లలో బయోమెట్రిక్ బదులుగా ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

## అచ్చెన్నకు నేతల బాసట

**కోటబొమ్మాళి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఈఎస్ఐ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొని హైకోర్టు బెయిల్‌తో స్వగ్రామమైన నిమ్మాడ చేరుకోగా విశాఖ పట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పలువురు నేతలు. కార్యకర్తలు తరలి వస్తున్నారు. మంగళవారం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణతో పాటు టెక్కలి, నందిగాం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు అచ్చెన్నాయుడును పరామర్శించి బాసటగా నిలిచారు. మాజీ మంత్రి అచ్చెన్నాయడు నిమ్మాడ చేరుకున్నప్పటినుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చి అచ్చెన్నాయుడుకు జేజేలు పలుకుతున్నారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యకర్తలక అచ్చెన్న చేయి ఊపి అభివాదం చేశారు.

## భారతదేశంలో సరికొత్త పానిగేల్ వి2 విడుదల చేసిన డుకాటి



విలాసవంతమైన మోటార్ సైకిల్ బ్రాండ్ డుకాటీ నేడు తన సరికొత్త పానిగేల్ వి2 భారతదేశంలో ఐఎన్ఆర్ 16.99లక్షలకు (ఎక్స్-షోరూం భారతదేశం) విడుదల చేసింది. ఈ సరికొత్త పానిగేల్ వి2 సదృఢమైన మరియు కాంప్యాక్ట్ బైక్ కాగా, క్లాసిక్ డుకాటీ సూపర్ బైక్ శక్తిలో రాజీపడని శక్తిని ప్రతిబింబించే స్పష్టమైన లైన్ల అవసరాన్ని కలిగిన డిజైన్ బైక్‌గా తయారైంది. పానిగేల్ వి2 955 ట్విన్ సిలిండర్ సూపర్ క్వాడ్రో ఇంజిన్‌ను కలిగి ఉండగా, ఇప్పుడు అది బిఎస్-6 కాంప్లియెంట్‌తో, ఎక్కువ శక్తి (೦5 హెచ్.పి) మరియు టార్క్ (೦2 ఎన్ఎం) అందిస్తుండగా, దానికి నూతన ఇంజెక్టర్లు మద్దతుగా నిలుస్తున్నాయి (విభిన్న పని కోణపు పెద్ద పరిమాణం) మరియు ఎక్కువ దక్షత కలిగి స్నోర్కెల్ కలిగి ఉండగా, అది ఒత్తిడి నష్టాన్ని తగ్గిస్తుంది. వి2 నూతన కాంప్యాక్ట్ ఎగ్జాస్ట్ కలిగి ఉండగా, ఇది పూర్తిగా ఇంజిన్ దిగువ ఉంటూ పానిగేల్ కుటుంబపు యువ సభ్యునిగా సుందరమైన లైన్స్‌తో స్వచ్ఛమైన రూపాన్ని అందిస్తుంది. దీని గురించి డుకాటీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బిపుల్ చంద్ర మాట్లాడుతూ "పానిగేల్ పోర్ట్‌ఫోలియో డుకాటీ సూపర్ బైక్ ప్రయాణంలో గమనార్హమైన మైలురాయి కాగా, అది ఈ బ్రాండ్‌కు అసాధారణ గుర్తింపును తీసుకు వచ్చింది. పానిగేల్ వి2 విడుదలతో మేము వాస్తవమైన డుకాటీ అనుభవాన్ని అందించడంతో పాటు రూపం మరియు లభ్యతల కుటుంబాన్ని వినియోగదారుల చెంతకు తీసుకు వస్తున్నాము. ప్రభావాన్ని చూపించేలా తయారు చేసిన ఇది నిర్ణయాత్మకమైన లక్షణాలు కలిగిన సూపర్ బైక్‌గా మరియు ప్రారంభ దశలో ఉన్న వారికి అలానే పరిణితి కలిగిన వారికి కూడా ఇందులో అపరిమిత ఆనందం లభిస్తుంది.

# విశాఖ రూరల్

## నిలిచిన ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం

**మాడుగుల, వార్తావళి సెప్టెంబర్ 9 :** మాడుగుల కేంద్రం కొబ్బరి తోట వీధి సమీపంలోగల సీతారామ స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి విరాళాలు అందించే దాతలు ముందుకు వస్తున్నారు. అతి పురాతనమైన సీతారామ స్వామి ఆలయం నిర్మాణం తర్వాత ప్రహరీ గోడ నిర్మాణం, ఆలయానికి గేట్లు, గ్రిల్స్ వంటి వివిధ అభివృద్ధి పనులు నిధులు లేక పెండింగ్లో పడింది. ఈ తరుణంలో మన్యం జ్యోతి యువజన సేవా సంఘం సభ్యులు గ్రామ పెద్దలు ప్రత్యేక చొరవ చూపించి దాతల నుంచి విరాళాలు సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ఇప్పటికే పలువురు దాతలు అందించిన విరాళాలతో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి అయింది. కాగా మిగిలిన పనుల నిమిత్తం విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని వార్తావళి దినపత్రికలో బుధవారం వెలువడిన కథనానికి, స్పందించిన స్థానిక న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు నాలుగు వేల రూపాయలు, సిరిసిల్ల సూర్యనారాయణ మాస్టారు నాలుగు వేల రూపాయలు విరాళాన్ని యువజన సేవా సంఘం వారికి అందిస్తామని హామీ ఇచ్చినట్లు మన్యం జ్యోతి యువజన సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఇదేవిధంగా మరికొంత మంది దాతలు ముందుకు వస్తే ఆలయ నిర్మాణం పనులు పూర్తిస్థాయిలో జరుగుతుందని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## రూ. 50 లక్షలతో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన నిర్మాణం

**మాడుగుల, వార్తావళి సెప్టెంబర్ 9 :** మాడుగుల కేంద్రంలో 50 లక్షల రూపాయల నిధులతో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన నిర్మాణం చేపట్టేందుకు గాను స్థలం ఎంపిక చేయడం జరిగిందని పిఎసిఎస్ అధ్యక్షుడు, స్థానిక వైసీపీ నాయకుడు బసవ రామ పరమేష్, వేమవరపు రామ ధర్మజ తెలిపారు. 50 లక్షల రూపాయలతో ఎమ్మెల్యే నాయుడు ఆదేశాల మేరకు స్థానిక వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం సమీపంలో దాని నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. రానున్న కాలంలో ఈ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ వలన రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగే కార్యక్రమం ఉంటుందని అన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి భూసారాన్ని బట్టి ఏ ఏ పంటలు పండించాలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దీనివలన రైతులకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించి పనులు ప్రారంభించడం జరుగుతుంది అని చెప్పారు.

## వాలంటీర్‌పై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు

**మాకవరపాలెం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** గ్రామ వాలంటీర్‌పై దాడి చేసిన ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మాకవరపాలెం ఎస్సై కరక రాము తెలిపారు. తూటిపాల గ్రామ వాలంటీర్‌గా పని చేస్తున్న నగేష్, మరికొంత మంది యువకులు సోమవారం సాయంత్రం క్రికెట్ ఆడుకుంటున్నారు. ఈ సమయంలో వారి మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగింది. దీంతో ఎం. జయంత్, వి.కిట్టయ్య, వి.శంకర్, ఎస్.అర్జున్, ఎం.చిరంజీవి, కె.తరుణ్ తనపై దాడి చేసి కొట్టారంటూ గ్రామ వాలంటీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కొత్తకోట సిఐ గ్రామంలో విచారణ తర్వాత దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనుల్లో పర్యవేక్షణ కరువు

**కేడీపేట, వార్తావళి, సెప్టెంబర్ 9 :** ఏఎల్‌పుపేరం పంచా యతీ కార్యాలయం వద్ద డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టా రాజ్యంగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## అదృశ్యమైన యువకుడు ప్రత్యక్షం

**నాతవరం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** తాను ప్రేమించిన యువ తిని వేధిస్తు న్నానని పోలీసులు కేసు నమోదు చేయడంపై నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన చిత్రాడ శ్రీను మనస్థాపానికి గురై తాను చనిపోతున్నట్లు లేఖ రాసి మోటార్ బైక్‌ను తాండవ నది ఒడ్డున వదిలి కనిపించకుండా పోయాడు. ఈ విషయం తెలుసు కున్న నర్సీప ట్నం రూరల్ సిఐ కె.అప్పలనాయుడులు జలాశ యాన్ని జల్లెడ పట్టినా శ్రీను ఆచూకి తెలియలేదు. అయితే శ్రీను ఫోన్ ఆధా రంగా వాకబ్ చేయగా కాకినాడలో ఉన్నట్లు తెలియడంతో పోలీ సులు అదుపులో తీసుకున్నారు. తనను ప్రేమించమని వేధిస్తు న్నాడని చెర్లోపాలెం గ్రామానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు శ్రీనును అదుపులో తీసుకోవడం జరిగిందని ఎస్సై రమేష్ తెలిపారు.

## ప్రైవేటు టీచర్లకు నిత్యావసరాలు పంపిణీ

**నర్సీపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** నర్సీపట్నం నలంద స్కూల్ ప్రిన్సిపాల్, ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నర్సీపట్నం నియోజకవర్గ అధ్యక్షులు ఎంఎన్. నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం స్కూల్ టీచింగ్ నాన్-టీచింగ్ సిబ్బందికి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యాసంస్థలు ఈ కష్ట సమయంలో విద్యాసంస్థలను నమ్ముకొని ఉన్న టీచర్లను ఆదుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం ప్రైవేట్ టీచర్లకు కరోనా భృతి కల్పించాలని కోరారు.

## వైసిపి ప్రభుత్వ 16 నెలల పాలన చూసి దేశమే సిగ్గు పడుతుంది

### ఎంఎల్‌సి బుద్ధ నాగ జగదీశ్వరరావు




**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** రాష్ట్రంలోని పెత్తందారీ వ్యవస్థ నియంతృత్వ పోకడలతో రాచరిక పాలన సాగిస్తుందని ఆ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌ని అప్పులు తేవడంలో ఒకటో స్థానంలో కరోనా వైరస్ లో రెండవ స్థానంలో రైతుల ఆత్మహత్యల్లో మూడవ స్థానంలో అభివృద్ధిలో మాత్రం అట్టడుగున నిలిచిందని శాసనమండలి సభ్యులు శ్రీ బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు జగన్ మోహన్ రెడ్డి16 నెలల పాలన లో సాధించిన విజయాలను చూసి దేశమే సిగ్గు పడుతుందని తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన 40 కు పైగా పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది లక్షా 85 వేల కోట్లు పెట్టుబడులను లక్షల కోట్లు ప్రజా ఆస్తి అయిన అమరావతిని నిర్వీర్యం చేసిందని నాగ జగదీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రత్యేక హెూదా పై మెడలు వంచి సాధిస్తామని చెప్పిన మాటలు గాలికి వదిలేశారు పోలవరం పనులు నిలిపి వేయడం వల్ల అటు నిర్వాసితులకు ఇటు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని గోదావరి వరద ప్రవాహం ఉపయోగం లేకుండా సముద్రంలో కలిసిపోతుందని కొత్త ఇసుక పాలసీ మద్యం పాలసీలతో అందినకాడికి దోచుకుంటున్నారని పేదల జీవితాలను నాశనం చేస్తున్నారు దిశ చట్టం తెచ్చా మంటూ రాష్ట్రపతి ఆమోదం పొందని చట్టం పేరుతో పోలీస్ స్టేషన్లను తెరిచామంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని నాగ జగదీష్ తెలిపారు రాష్ట్రంలో కక్ష సాధింపు దోపిడి దౌర్జన్యం అక్రమ అరెస్టులు రాజ్యమేలుతున్నాయని వ్యవస్థలను పూర్తిగా కుప్పకూల్చారని కోర్టులు ఎనభై ఆరు సార్లు ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన అధికారులు ఎవరూ పై చర్యలు లేకుండాపోయాయన్నారు ప్రశ్నించే వారిని బూతులు తిట్టడం చంపేస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే బాధ్యత ప్రతిపక్షాలకు ఉంటే సమాధానం చెప్పవలసిన పాలకులనే ఇంగితజ్ఞానం ప్రభుత్వానికి లేకుండా పోయిందని నాగ జగదీష్ తెలిపారు పోలీస్ స్టేషన్లో దళిత యువకుడికి శిరోముండనం దళిత బాలికను దారుణంగా అత్యాచారం చేసి బయటపడే వేయడం వంటి ఘటనలు పోలీస్ వ్యవస్థ దిగజారుడుతనానికి సంకేతమని నాగ జగదీష్ స్పష్టంచేశారు ఇకనైనా ఇటువంటి సంఘటనలు జరగకుండా దళితులపై దౌర్జన్యాలు ఆపాలని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాగ జగదీష్ డిమాండ్ చేశారు.

## బైపాస్ రోడ్డు దాటడం అంటే బ్రతుకు జీవుడా అన్నట్టుంది

### టిడిపి విశాఖఅర్బన్ కార్యదర్శి బి.యస్.ఎమ్.కె.జోగినాయుడు





**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** అనకాపల్లి గవరపాలెం శ్రీ నూకంబికా అమ్మవారి ఆర్చ్ బైపాస్ రోడ్డు దాటి తోటాడ కు వెళ్ళే రోడ్డు అంటే ప్రజలందరు చాలా బయపడే పరిస్థితుల్లో వున్నారు మరి ముఖ్యంగా ఫార్మసిటి కంపిణిలు అన్నింటికి వెళ్ళాడానికి,మునగపాక మండలం నకు సంబదించిన గ్రామలన్నింటికి వెళ్ళే ప్రధాన రహదారి అవ్వడం వలన నిత్యం ఎంతో రద్ధిగా తిరిగే ప్రయాణం కావడం వలన ప్రజ లందరు భయాందోళనకు గురుఅవుతున్నారు. ఇప్పుడు బైపాస్ రోడ్డు దాటి తోటాడ రోడ్డుకు వెళ్ళేటప్పుడు అక్కడ హైవే రోడ్డుకు ప్రక్కన వున్న సర్వీస్ రోడ్డు వర్షాల కారణంగా చాలా దారుణం గుంతలు పడడం వలన నిత్యం బైక్ మిద వెళ్ళే వారు పోలంలోకి వెళ్ళే రైతులు అక్కడ దారుణంగా జారీ పడిపోతున్నారు ఈ గుంతలో పడి ఎవరైనా తూళి రోడ్డుపైకి వస్తే అది నేషనల్ హైవే బైపాస్ రోడ్డు కావడం వలన చాలా ప్రమాదాలకు దారీ తీసే విధంగా కనిపిస్తుంది. దయచేసి సంబంధిత అధికారులు చోరవ తీసుకొని వెంటనే దీనికి పరిష్కరించవలసింది గా కొరుకంటున్నాం. ఈరోజు ఇది చిన్న సమస్యగా బావించవద్దు ఎందుకంటే హైవే రోడ్డు కావడం వలన ప్రమాదం ఏ సమయంలో ఏఏ దారుల్లో వస్తుం దో తెలియదు కాబట్టి సదరు ఆధికారులు దీని పై తక్షణమే స్పందించి హైవే రోడ్డు ఆధి కారులతో చర్చించి ఆ సర్వీస్ రోడ్డు తక్షణమే వేసే విథంగా చర్యలు చేపట్టి ప్రజలను కపాడవలసిన బాద్యతను విస్మరించకుండా చర్యలు చేపట్టాలని జోగినాయుడు డిమాండ్ చేశారు. అక్కడ రోడ్డు క్రాస్ గా వుండడం వలన రోడ్డు దాటే సమయంలో నిత్యం చాలా ప్రమాదాలు జరిగేవి అని దానికి వెంటనే పట్టణ పోలీస్ శాఖ వారు చోరవతో అక్కడ బారి కేడర్ లు ఏర్పాటు చేసి ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ ను పెట్టి చాలా వరకు ట్రాఫిక్ సమస్యను, యాక్సిడెంట్స్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొన్న పోలీస్ శాఖ వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం అని జోగినాయుడు అన్నారు.దయచేసి ఈ సర్వీస్ రోడ్డును వెంటనే పునరఃదుంచి ప్రజల ప్రాణాలుతో చెలగాటలు ఆడడం మాని సంబంధిత ఆధికారులు చర్యలు తీసుకొనే దిశగా అడుగులు వేయాలని జోగినాయుడు వారిని హెచ్చిరించారు.

# అనకాపల్లికి ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 9 :** పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో అనకాపల్లిలో వైద్యకళాశాల ఏర్పాటుకు అడుగుపడింది. ఈ ప్రాంతంలో వైద్యకళాశాల ఏర్పాటు కావాలన్నది ప్రజల చిరకాల వాంఛ. పట్టణవాసుల చిరకాల స్వప్నం ఎట్టకేలకు నెరవేరబోతోంది. స్థానిక ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ విశేష కృషి తో ఇది సాధ్యమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లిలో వైద్యక ళాశాల మంజూరుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు నిధులు కూడా కేటాయించినట్లు తెలుస్తోంది. పేద విద్యార్థుల వైద్యకలను నిజం చేసేందుకు, అత్యాధునిక పరిజ్ఞానంతో ఇక్కడ మెడికల్ కళాశాల రూపుదిద్దుకోనుంది. అనకాపల్లి పట్టణంలో వైద్యకళాశాల ఏర్పాటు ద్వారా ఎందరో పేదలు, ఉత్తమ విద్యార్థులు ప్రముఖ వైద్యులుగా మారే అవకాశం రాబోతోంది. పేద ప్రజల వైద్య సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా ఈ వైద్యకళాశాల తలమానికంగా నిలవనుంది. కాగా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంకల్పం మేరకు రాష్ట్రవ్యాప్తం గా ఇప్పుడున్న 11 మెడికల్ కళాశాలలకు అదనంగా మరో 16 మెడి కల్ కాలేజీలు ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ కృషితో అనకాపల్లికి కూడా వైద్యకళాశాల మంజూరైంది. వైద్యకళాశాలతో పాటు దానికి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా ఇక్కడ ఏర్పాటు కానుంది. వీటి భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.500కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే అమర్‌నాథ్ స్పష్టం చేసారు. అయితే ఈ వైద్యకళాశాలను ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాకుండా పట్టణ నడిబొడ్డున ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నది ఎమ్మెల్యే అమర్ ఆలోచన. ఈ మేరకు ఆయన స్థానిక చెరకు ప్రాంతీయ పరిశోధనా స్థానానికి చెందిన 30ఎకరాల స్థలంలో ఈ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దీనికి సంబంధించి మట్టిని కూడా పరిశీలించారు. ప్రాంతీయ పరిశోధనా స్థానం 103ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిశోధ నా స్థానంలోని 30ఎకరాల్లో వైద్యకళాశాల ఏర్పాటు చేస్తే అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అమర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. కాగా ప్రభుత్వం కూడా ఎమ్మెల్యే అమర్ నిర్ణయం పట్ల సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. వైద్య విద్య పేద, మధ్యతరగతి వారికి అందని ద్రాక్షగా మారుతున్న తరుణంలో అనకాపల్లిలో వైద్యకళాశాల ఏర్పాటు ప్రక్రియను ప్రజలు హర్షిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ చిన్న అనారోగ్య సమస్య ఉత్పన్నమయినా వేలాది రూపాయలు ప్రైవేట్ ఆసుపత్రులకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిణామం పేదలకు భారంగా పరిణ మిస్తోంది. మరీ అత్యవసర పరిస్థితులు ఏర్పడితే విశాఖ కేజీహెచ్‌కు పేదలు పరుగులు తీయాల్సిందే. కాగా ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు పేదలకు కూడా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణంమీదకు వస్తే పైసా ఖర్చులేకుండా ఖరీదైన కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అం దించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే అమర్ పట్టణంలోనే వైద్యకళాశాల ఏర్పాటుకు ముందుకు వెళుతున్నారు. ఈ ప్రాంత ప్రజల వైద్యం, ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు. ఇక్కడ మెడికల్ కాలేజీ ఏర్పాటైతే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వైద్య విద్య సులువుగా అందుబాటులోకి వస్తోంది. అలాగే వైద్యకళాశాల ఏర్పాటుతో పాటు దానికి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటు లోకి రావటం వల్ల పేద ప్రజలకు నిరంతరం ఆధునిక వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకు ఆయన విశేషంగా పాటుపడుతున్నారు. ఇప్పటి వరకూ అనకాపల్లిలో ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు విశేష సేవలు అందిస్తుండగా వైద్యకళాశాల ఏర్పాటుతో సూపర్ స్పె షాలిటీ ఆసుపత్రి వచ్చే అవకాశం ఉన్నందున అత్యవసర సమ యాల్లో పేదల ప్రాణాలకు భరోసా ఉంటుందని పలువురు అభిప్రా యపడుతున్నారు. పట్టణంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రజలతో పాటు పలు ప్రజా సంఘాలు, పలువురు పురప్రముఖులు స్వాగతిస్తున్నారు. అభినందలు తెలుపుతున్నారు. కాగా మరికొందరు మాత్రం ఈ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. కాగా అనకాపల్లిలో వైద్యకళాశాల ఏర్పాటుపై పలువురు ప్రముఖులు అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

## రెండు రోజులు బ్యాంక్ సేవలు నిలుపుదల

**మునగపాక, వార్తావళి, సెప్టెంబర్ 9 :** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల్లో ఒకరికి కోవిడ్ లక్షణాలు తలెత్తడంతో రెండు రోజులు పాటు బ్యాంక్ సేవలు నిలుపుదల చేస్తూ ఆ బ్యాంక్ సీఈవో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ నెల 9, 10 తేదీలలో బ్యాంక్ సేవలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు మంగళవారం సాయంత్రం నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. పేరుకు సహకార బ్యాంక్ అయినా జాతీయ బ్యాంకులకు ధీటుగా సేవలందిస్తూ ఇటు రైతులు, అటు ఇతర వినియోగదారుల మన్ననలను పొందుతోంది. మునగపాకలో ఉన్న ఎస్.బి.ఐ నిత్యం రద్దీగా ఉండడం వలన సహకార బ్యాంకు సేవలు పొందే వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. వ్యవసాయ రుణాలుతో పాటు బంగారం ఆభరణాలుపై రుణాలు, లాకర్ సదుపాయం ఇలా జాతీయ బ్యాంకులు అందించే సేవలను సహకార బ్యాంకు కూడా అందించడం వలన నేడు అనేక మంది ఈ బ్యాంకు సేవలుపై ఆధారపడుతున్నారు. కోవిడ్ లాక్‌డౌన్ కాలంలో కూడా స్థానిక ఎస్బీఐ కంటే సహకార బ్యాంకు ఎక్కువ రోజులు పాటు సేవలందించిన విషయం అందరికీ తెలిసిందే. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ అధికశాతం ఇంటికే పరిమితంగా ఉన్న వారు సైతం కోవిడ్‌కు గురవుతున్న తరుణంలో మాస్కు ధరించడంతో పాటు శానిటైజర్ వినియోగించినా నిత్యం వందలాది మంది ఖాతాదారులుతో లావాదేవీలు నిర్వహించే ఉద్యోగులకు, సిబ్బందికి కోవిడ్ లక్షణాలు ఏదోరూపంలో రావడం సర్వసాధార ణమేనని పలువురు బావిస్తున్నారు. రైతులు, ఖాతాదారులు కోవిడ్ సమస్యను దృష్టిలో పెట్టుకొని రెండు రోజులు బ్యాంకు సేవలకు దూరంగా ఉండాలన్నారు.

## హిందువుల మనోభావాలు రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

### జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

**నర్సీపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 9 :** హిందువుల మనోభావాలు రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు(బుజ్జి) అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా రాష్ట్రంలో అనేక సంఘటనలు జరుగు తున్నాయన్నారు. దేవతా విగ్రహాల ధ్వంసం, రధాలకి నిప్పు, పూజారులపై దాడులు, ఆలయ భూముల అమ్మకం, గోశాలల్లో గోవుల మృత్యుఘోష ఇప్పుడు తాజాగా 60ఏళ్లుగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కళ్యాణోత్సవానికి ఉపయోగించిన రథం దగ్ధం కావడంతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నిత్యం జరుగుతున్న ఈ ఘటనలు రాష్ట్రానికి అరిష్టం అని పండితులు పదే పదే చెబుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి చేసాడని ఓసారి, షార్ట్ సర్క్యూట్ అని, తేనే తీగలు అని, పేకాట ఆడే బ్యాచ్ వలన ప్రమాదం జరిగిందని బాధ్యతా రాహిత్యంగా దేవాదాయ శాఖ మంత్రి నిర్లక్ష్యంగా మాట్లాడటం, ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అసలు ఈ ఘటనలు గురించి స్పందించకపోవడం హిందువుల్లో అనేక అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. హిందూ ఆలయాలు, ధార్మిక సంస్థలపై జరుగుతున్న దాడులను ప్రశ్నించినందుకు హిందూ సంఘాల ప్రతినిధులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

## విద్యార్థిలోకానికి దిశా, నిర్ధేశంగా విద్యా ప్రమాణాలు

**మునగపాక, వార్తావళి, సెప్టెంబర్ 9 :** కరోనా కాలం అందరిలాగే మనం కూడా ఇంటికే పరిమితమై మన కుటుంబం, మనం ముందు అనే విధంగా ఆలోచనలు చేయకుండా తను తలపెట్టిన సంకల్పం యథాతథంగా అందించడమే లక్ష్యంగా పాలిసెట్-2020 ప్రవేశ పరీక్షకు సిద్ధంగా ఉన్న విద్యార్థులకు నేనున్నానంటూ రోహిణి మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి భీమిశెట్టి ఉమాశంకర్ భరోసా నిస్తున్నారు. కోవిడ్-19 నిబంధనలను దృష్టిలో పెట్టుకొని భౌతికదూరం పాటిస్తూ శిక్షణ అందిస్తున్నారు. ఉన్నత చదువుల కల్పనకు వందలాది విద్యార్థులకు దిశానిర్ధేశంగా నిలిచేందుకు నేను సైతమంటూ విద్యార్థిలోకానికి రోహిణి మెమోరియల్ ట్రస్టు భరోసాగా నిలుస్తోంది. మునగపాక మండలం తిమ్మరాజుపేట కేంద్రంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సేవలకు భీమిశెట్టి ఉమాశంకర్ కర్తగా వ్యవహరిస్తున్నారు. పేదలకు వస్త్రదానం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమదానం చేయడం వంటి పలు సేవా కార్యక్రమాలను రోహిణి మెమోరియల్ ట్రస్టు నిర్వహిస్తోంది. ఒక వైపు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరోవైపు విద్యార్థులకు ఉన్నత చదువుల కల్పనకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దానికి అనుగుణంగా గడచిన కొన్నేళ్లుగా నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకొని వారికి డిప్లొమో విద్యను రోహిణి మెమోరియల్ ద్వారా అందజేస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా విలువైన స్టడీ మెటీరియల్ బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో ఉమాశంకర్ మాట్లాడుతూ త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు డిప్లొమో కోర్సు ఎంతగానో దోహదపడుతుందని, ఆర్థికపరమైన ఇబ్బందులు కారణంగా చదవలేని పరిస్థితి ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వారిని చదివించగలనని చెప్పారు.

## 10న మునగపాక మరిడమ్మ పండుగ

**మునగపాక, వార్తావళి, సెప్టెంబర్ 9 :** మండల కేంద్రమైన మునగపాకలో దాడి వారి ఇలవేల్పుగాను, గ్రామ ప్రజల ఆరాధ్య ధైవంగాను ప్రఖ్యాతగాంచిన శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ ఈ నెల 10వ తేదీ గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించే ఈ పండుగను కోవిడ్-19 కారణంగా పూర్వీకుల కాలం నుంచి వస్తున్న సాంప్రదాయం, ఆచారాలకు అనుగుణంగా సాదాసీదాగానే నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ఏటా వినాయక చవితి తరువాత దసరాకు ముందు మరిడిమాంబ అమ్మవారి పండుగను నిర్వహించుకోవడం పూర్వీకుల కాలం నుంచి వస్తున్న సాంప్రదాయం. మొదట్లో ఈ పండుగను కేవలం వేపచెట్టు ప్రాంతానికి చెందిన దాడి వారి కుటుంబీకులు మాత్రమే అమ్మవారి పండుగను నిర్వహించుకునే వారు. కొన్ని సంవత్సరాలకు పండుగ గ్రామంలో అన్ని ప్రాంతాల్లో ఉన్న దాడి వారి కుటుంబీకులు అంతా చేసుకునే దిశగా ప్రాధాన్యత సంతరించుకుంది. అమ్మవారి విశిష్టత, మహిమళను గుర్తించిన గ్రామస్తులంతా ఈ పండుగను నిర్వహించుకోవడం మొదలు పెట్టుకున్నారు. ఊరంతా ఆసక్తి చూపడంతో పండుగ ప్రాముఖ్యత పెరగడంతో నిర్వాహణ బాధ్యతను గ్రామ పంచాయతీ వారు తీసుకున్నారు. ఆ నాటి నుంచి పండుగను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ పండుగతో పాటు శ్రీ పరదేశమ్మ, దుర్గాలమ్మ, పసరమారమ్మ పండుగులను కూడా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే.

# విశాఖపట్నం



రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గం, తగరపువలస, హరిజన సంతపేటలో సామాజిక భవనం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వైస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ వాలంటీర్ మార్గదర్శకాలు పుస్తకం ఆవిష్కరణ చేసి, పంపిణీ చేశారు.

**– అర్జా రాజేష్ వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖ దక్షిణం**



విశాఖపట్నం, సెప్టెంబర్ 8: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి మండలం తాటితూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం నకు శంకుస్థాపన చేశారు. అనంతరం అంగన్వాడీ భవనం ప్రారంభించినారు.

**– అర్జా రాజేష్ వార్తావళి ఫోటోగ్రాఫర్, విశాఖ దక్షిణం**

## యరాడలో గురువులకు సత్కారం

**మల్కాపురం, వార్తావళి, సెప్టెంబర్ 9:** కొండవాలు ప్రాంతం మారుమూల యరాడా గ్రామంలో బుధవారం ఉపాధ్యాయులకు సత్కారం వై ఎస్సార్సీపీ, నాయకుడు నాగోతి మధు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపా ధ్యాయులకు ఘనంగా సత్కరించారు గ్రామకమిటి వైస్సార్ దివ్యాం గుల సంగ నాయకుడు వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## జ్యూట్ మిల్ యాజమాన్యం ఆధ్వర్యంలో సమీక్ష..

**భీమునిపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 9:** చిట్టివలస జ్యూట్ మిల్ కార్మికుల బకాయిల చెల్లింపుపై మంత్రి అవంతి, కలెక్టర్ వినయ్ చంద్ జ్యూట్ మిల్ యాజమాన్యం ఆధ్వర్యంలో రిక్యూట్ హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అవంతి మాట్లాడుతూ ప్రభుత్వ అధీనంలో 25 కోట్లు పూర్తిగా చెల్లింపులకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్మికశాఖా మంత్రి జైరాం ఆధ్వర్యంలో చేసుకున్న అగ్రిమెంట్ కరోనా కారణంగా ఆగిపోయిందని అన్నారు. మళ్ళీ దానిపై పునఃసమీక్షించి డిసెంబర్ 31 లోగా దశలవారీగా 25 కోట్లు చెల్లించడానికి జ్యూట్ మిల్ యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. అక్టోబర్ నుండి మొదలుకొని డిసెంబర్ కి చెల్లింపుల ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ వినయచంద్ అన్నారు. అక్టోబర్ లో 11 కోట్లు, నవంబర్‌లో 7 కోట్లు, డిసెంబర్ లో 7 కోట్లు చెల్లించను న్నట్లు కలెక్టర్ తెలిపారు. జ్యూట్ మిల్‌లో పనిచేసిన 6700 కార్మికు లకు 470 కాంట్రాక్టు కార్మికులకు బకాయిలు పూర్తి స్థాయిలో అందజేస్తామని జ్యూట్ మిల్ యాజమాన్యం తెలిపింది. సమీక్షలో వివిధ కార్మిక సంఘాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు, బాలింతలకు సంపూర్ణ పోషణ పౌష్టిక ఆహారం అందజేత

**భీమునిపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 9:** స్థానిక శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి గుడి వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో భీమిలి జీవీఎంసీ–3వ వార్డు అభ్యర్థి మైలపల్లి భారతి షణ్ముఖరావు వైసిపి నాయకుల ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు సంపూర్ణ పోషణ పౌష్టిక ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగ న్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని గర్భిణులు బాలింతలు చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందజేయాలనే సహృదయంతో ఇప్పటికే; అమలులో ఉన్న వైఎస్సార్ అమృత హస్తం మధ్యాహ్న భోజన పథకం బాలామృతం వైయస్సార్ బాల సంజీవనికి అదనంగా ఈ వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. నేటి తరంలో చాలామంది పిల్లలకు మంచి ఆహారం అందించ లేక వారిని స్కూల్లో చదివించ లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ప్రతి ఒక్కరూ చదువుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సంకల్పంతో ఈ పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశ; పెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లిపిల్లి నర్సింగరావు,బీసీ సెల్ అధ్యక్షులు వాసుపల్లి కొండబాబు ,మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ ,కోంద్రు రామసూరప్పడు, ఎల్లాజీ రావు, గుండాసు మధు నాయుడు ,ఆర్. ప్రభాకర్ నాయుడు ,గౌరి నాయుడు, బోని సంజీవరావు; ,వాడమొదుల జగ్గారావు, సిహెచ్. అప్పలరాజు ,క్రరోతు రమణ బాబు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 9:** గుర్తు తెలియని మృతదేహం లభ్యం విశాఖ నగరంలోని ఫిషింగ్ హార్బర్ రొడ్డులో నేవీ క్యాంటీన్ ఎదురుగా గుర్తు తెలియని మృతదేహం దొరికింది. దీంతో స్థానికులు వటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారి సహాయంతో బాడీని కేజీహెచ్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అయితే ఈ గుర్తు తెలియని మృతదేహం పట్ల ఎవరైనా వన్ టౌన్ పోలీసులు సంప్రదిస్తే వారికి బాడీని అందజేస్తామని పోలీసులు తెలిపారు.

## రాబోయే రోజుల్లో విఎంఆర్డీఎకు పూర్వ వైభవం

**రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెల్లడి**



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 9:** రాబోయే రోజుల్లో విఎంఆర్డీఎకు పూర్వ వైభవం తీసుకురానున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం విఎంఆర్డీఎ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ లో విఎంఆర్డీఎకు మూడు, నాలుగు దశాబ్దాల నుండి ఒక మంచి పేరు ఉందన్నారు. మూడు జిల్లాల్లో మంచి లేఅవుట్లు వేసి, ప్రభుత్వానికి ఆదాయం తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో విఎంఆర్డీఎ తరపున చేపట్టిన కార్యక్రమాలను పారదర్శకంగా, ఎలాంటి బంధుప్రీతి లేకుండా కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. విఎంఆర్డీఎ, పర్యాటక శాఖలలో పెండింగ్ లో ఉన్న ఎన్ఎడి పై వంతెన, వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రేవు పోలవరం, యారాడ, తంతడి, పూడిమడక, తదితర బీచ్ ల్లో పర్యాటక ప్రాంతాలను గుర్తించి పిపిపి మోడ్ లో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఆర్కియాలజీకి సంబందించి తొట్లకొండ, బావికొండ, పావురాలకొండలకు బద్దిస్టులు వచ్చి ద్యానించుకొనే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఆదాయం పెంచే దిశలో చర్యలు తీసుకుంటామన్నారు. టూరు ఆపరేటర్లు, ట్రావెల్స్ అండ్ టూరు ఆపరేటర్లు టూరిజంనకు సంబంధించిన కార్యక్రమాలు చేయాలంటే తప్పనిసరిగా పర్యాటక శాఖలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకొని లైసెన్సు పొందాలని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం ప్రపంచ పటంలో ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 12 స్థలాల్లో అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో విఎంఆర్డీఎ కమీషనర్ కోటీశ్వరరావు, గాజువాక శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, అనకాపల్లి శాసన సభ్యులు గుడివాడ అమర్ నాథ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు అందే విద్యుత్తు ఎప్పటికీ ఉచితమే

**ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణదాస్**




**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 9:** రైతులకు అందే విద్యుత్ ఎప్పటికీ ఉచితమేనని, ఇందులో ఎటువంటి సందేహాలకు తావులేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ స్పష్టం చేసారు. వై.యస్.ఆర్. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం – లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీపై అవగాహన సదస్సు బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి క్రిష్ణదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు వై.యస్.ఆర్. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం అమల్లో ఉండేవిధంగా విధానపరమైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఉచిత విద్యుత్ పథకానికి మెరుగులు దిద్ది రైతు సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని చెప్పారు. రైతుకు అందే విద్యుత్తు ఎప్పటికీ ఉచితమేనని, ఇందులో ఎటువంటి సందేహం అవసరం లేదని తెలిపారు. ప్రస్తుతం రైతులకు ఉన్న ఒక్క కనెక్షన్ కూడా తొలగించబోమని, అనధికారి కంగా ఉండే కనెక్షన్లను రెగ్యులరైజ్ చేస్తామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్లు లేని రైతులు కూడా ఈ పథకంలో భాగస్వాములు అవుతారని, వారికి కూడా కొత్త కనెక్షన్లు ఇస్తామని స్పష్టం చేసారు. ఇందుకు అవసరమైన మీటర్లను ప్రభుత్వమే ఏర్పాటుచేస్తుందని, రైతు ఒక్క పైసా కూడా చెల్లించనవసరం లేదని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఉన్న రైతు పేరు మీద ప్రత్యేక బ్యాంకు ఖాతాను తెరచి ఆ ఖాతాలో విద్యుత్ బిల్లులకు చెల్లించవలసిన డబ్బులను జమచేస్తామని, రైతు ఖాతాల నుండి నేరుగా డిస్కంలకు జమ అయ్యేవిధంగా వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నివాస్, శాసన సభ్యులు కంబాల జోగులు, విశ్వసరాయి కళావతి, ట్రాన్సు కో పర్యవేక్షక ఇంజనీరు ఎన్.రమేష్, డివిజనల్ ఇంజనీర్లు జి.టి.ప్రసాద్, చలపతి రావు., దువ్వాడ శ్రీనివాస్, తమ్మినేని చిరంజీవి నాగ్., ఇపిడిసిఎల్ అధికారులు తదితర అధికార అనధికారులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 9:** జీవీఎంసీ 15వ వార్డ్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం వై.యెస్.ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమం ముఖ్య అతిథిగా నడిం పల్లి కృష్ణంరాజు మాజీ కార్పొరేటర్ మరియు రాష్ట్ర అదనపు కార్య దర్శి పాల్గొని గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పోషక ఆహారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ వై.యెస్. జగన్ మోహన్ రెడ్డి గారు బిడ్డ కడుపులో ఉన్నపుడు గర్భిణీలకు, బిడ్డ పుట్టిన తర్వాత బాలిం తలకు, పుట్టిన తర్వాత పిల్లలకు పోషకాహారం, అలాగే ఎదిగిన పిల్ల లకు అమ్మవడి, చదువుకోసం విద్యాదీవన, 40 సం,?? లకు ఆసరా, 60 సం. లకు పెన్షన్ ఇలా మనిషి జీవిత కాలం భరోసా ఇచ్చిన నాయకుడు ప్రపంచంలోనే లేదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డ్ అభ్యర్థి నడింపల్లి రేవతి, అంగన్వాడీ టీచర్ నక్షత్ర, గ్రామ పెద్దలు చేరగడం నాగేశ్వరరావు, సన్యాసి రావు, బి. సత్యనారాయణ, వెంకట్రావు, రాజారావు, రవి, రమేష్, అచ్యుత, సరస్వతి పాల్గొన్నారు.

## ఒకేరోజు అన్ని పరీక్షలు నిర్వహించ వద్దు

**ప్రభుత్వానికి ఏపీ నిరుద్యోగ జెఏసి వినతి**

**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, సెప్టెంబర్ 9:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పరీక్షలు ఒకేసారి నిర్వహించకూడదని, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అన్ని పరీక్షలు ఒకేసారి రాయలేరని ఇంతే కాకుండా వైరస్ వ్యాప్తి ప్రమాదంలో పడే అవకాశం ఉందని,ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరంలో నిర్వహించవలసిన గెజిటెడ్ ఆఫీసర్స్ మెయిన్స్ పరీక్షలను ఈనెల సెప్టెంబరు 21 నుంచి 23 వరకు నిర్వహించనున్నారనీ, అదే తేదీలలో యూజీసీ నిర్వహించే నెట్ పరీక్షలు సెప్టెంబర్21 నుంచి 25 వరకు నిర్వహించనున్నారని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామ ,వార్డు సచివాలయ పరీక్షలు సెప్టెంబర్ 20 నుంచి 26 వ తేదీ వరకు ఉన్నాయని అన్నారు. అన్ని పరీక్షలు ఒకే తేదీలలో ఉండడంవల్ల నిరుద్యోగ అభ్యర్థులు ఏదో ఒక పరీక్షకు మాత్రమే హాజరు కావడం వలన ఇతర అవకాశాలు కోల్పోయే అవకాశం ఉన్నది. దీనివలన నిరుద్యోగ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సమస్యను తక్షణమే గమనించి ఒకే రోజు రెండు, మూడు పరీక్షలు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించవలసిన ఏపీపీఎస్సీ క్యాలెండర్ ను, డీఎస్సీని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా మంది వయోపరిమితి కోల్పోయారని వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

## 39వ వార్డులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారం పంపిణీ

**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, సెప్టెంబర్ 9:** స్థానిక 39వ వార్డు, అంబుసరంగ వీధి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం వైయస్సార్ పోషణ కార్య క్రమం నిర్వహించారు. గర్భిణీలకు, బాలింతలకు వార్డు వైసిపి కా ర్పొరేటర్ అభ్యర్థి కొల్లి సింహాచలం చేతులమీదుగా పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొల్లి సింహాచలం మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభు త్వం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని వివరించారు. పెరిగిన ఆహార పదార్థాల పరిమాణం పోషక విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ నజ్మా, అంగన్వాడి టీచర్, వైసిపి నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కరోనాపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పించడం హర్షణీయం

**వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్యే రజనీ స్వచ్ఛంద సంస్థలకు ప్రశంసలు**

**విశాఖపట్నం, పశ్చిమం, వార్తావళి, సెప్టెంబర్ 9:** కరోనా పై నియంత్రణకు ప్రజలలో అవగాహన పెంచేందుకు సామాజిక సేవలో భాగంగా విశాఖ నుంచి సింహాద్రి టి.యం.టి. సంస్థ, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేష న్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన ప్రచార ర్యాలీ వారం రోజులుగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడోవ రోజు బుధవారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయ్యిం ది. ప్రచారం బృందం సభ్యులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని గౌరవపూర్వకంగా కలుసుకోవడానికి వెళ్లారు. ఇందులో భాగంగా మొదటగా తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మను, వైయస్సార్సీపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చిలకలూరిపేట వైకాపా ఎమ్మెల్యే రజనిని కలిసి ఈ వారం రోజులు పాటు జరిగిన అవగాహన కార్యక్రమాల వివరాలను తెలియజేశారు.అనంతరం వాసిరెడ్డి పద్మకు, ఎమ్మెల్యే రజనీ కి జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ వారం రోజుల పాటు కరోనా పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పించడం హర్షణీయమని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టి.వి.డి.దాసు, యస్.రంజిత్ కుమార్, పాటల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాయకరావుపేట వద్ద ఎమ్మెల్సీ మాధవ్ అరెస్ట్



**పాయకరావుపేట, వార్తావళి, సెప్టెంబర్ 9:** హిందు ధార్మిక సంస్థలపై జరుగుతున్న వరస దాడులలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రథం దగ్ధాన్ని ఖండిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సోమువీర్రాజు గారు చేస్తున్న నిరసనకు మద్దతు తెలియజేస్తూ విశాఖ నుంచి బయలు దేరిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ మాధవ్ బృందాన్ని పాయకరావుపేట వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు బుధవారం విశాఖ నుంచి బయలుదేరిన ఈ బృందం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు పర్యటనకు మద్దతుగా అంతర్వేది బయలుదేరి వెళ్ళింది. మార్గ మధ్యంలోనే విశాఖ జిల్లా సరిహద్దుల్లో ఈ బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల చర్యలను మాధవ్ తప్పు పట్టారు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో హిందూ దేవాలయాలు హిందూ ధార్మిక ప్రాంతాలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలం అయిందని మండిపడ్డారు దేవాలయాలపై ప్రత్యక్షంగా భౌతిక దాడులు చేసి ఇ మారణహోమం చేస్తున్నవారికి అండగా ప్రభుత్వం నిలవడం చాలా దారుణం అన్నారు గత ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో సుమారు 17 దుర్ఘటనలు హిందూ దేవాలయాల పై జరిగితే నేటికీ ఒక్క దోషం కూడా అరెస్టు చెయ్యని పరిస్థితి ఉందన్నారు ఈ క్రమంలో ఈ ప్రభుత్వం హిందూ వ్యతిరేక సంఘ సంస్థలకు విద్రోహులకు కొమ్ముకాస్తున్నారు దేనికి పరిణామం త్వరలోనే ప్రజల నుంచి ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎమ్మెల్సీ మాధవ్ వెంట విశాఖ నగర జిల్లా బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




ఈ రోజు మన స్నేహితుడు మధుసూదన్ కుటుంబాన్ని కమిటీ మెంబెర్స్ పరామర్శించడం జరిగింది. అలాగే మన 91 బ్యాచ్ తరపునుంచి 12, 000, హరినాథ్ 10, 000, దొడ్డి అప్పారావు 2, 000, బుడుమూరి గోవింద్ 1, 000 మొత్తం 25, 000 వారి కుటుంబానికి అందజేయడం జరిగింది.

**– వార్తావళి, విశాఖ దక్షిణం**

## బిజెపి సీనియర్ నాయకులు కోరాడ అప్పారావుకు నివాళులు

**భీమునిపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 9:** జీవీఎంసీ 4 వార్డ్; జె.వి.అగ్రహా రంలో నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకులు స్వర్గీయ కోరాడ అప్పారావు కి నివాళులు అర్పిస్తూ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా; బిజెపి; సీనియర్ నాయకులు దక్షిణా మూర్తిహాజరయ్యారు. నగర ఓబిసి అధ్యక్షులు; కోరాడ విశేష సేవలందించారనీ, అప్పారావు సేవలు గుర్తించి గత సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గ శాసన సభ్య లుగా పార్టీ టిక్కెట్టు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్ర మంలో జీవీఎంసీ; నాలుగో వార్డుకో– ఆర్డినేటర్లు; కోరాడ శంక ర్రావు, కోడూరు సంజీవ రావు, 3వార్డ్ అధ్యక్షుడు లయ న్డాక్టర్. సత్తరవు వాయునందన రావు, పార్టీ నాయకులు 4 వ వార్డు బీజేపీ – జనసేన ఉమ్మడి అభ్యర్థి ధోని నాగరాజు, కె. పరిమళ, ఆనం దపురం మండల అధ్యక్షులు ప్రసాద్ రావు పట్నాయక్, సీని యర్ నాయకులు; పి.జయకృష్ణ ,; జీవీఎంసీ 2 వార్డు ఉమ్మడి అభ్యర్థి గనివాడ పార్వతి, జీవీఎంసీ 1 వార్డు; కన్వీనర్ డి. లీలావతి,; సీని యర్ నాయకులు పంపాన శ్రీధర్, రాజ్; పురోహిత్ కుమార్, కె.రాజారావు, పళ్ళ భరత్ కుమార్, పి.రాజేంద్ర ప్రసాద్, భీమునిపట్నం నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

## సకాలంలో వైద్యం అందక బాలింత మృతి

**అనంతగిరి, వార్తావళి, సెప్టెంబర్ 9:** అనంతగిరి పీహెచ్సి పరిధిలో సకాలంలో వైద్యం అందక ఓ బాలింత మృతి చెందింది. మృతురాలి భర్త అర్జున్ తెలిపిన వివరాల ప్రకారం. దండబడు గ్రామానికి చెందిన బుల్లమ్మకు పురిటి నొప్పులు రావటంతో మంగళవారం రాత్రి ఆసుపత్రికి తరలించారు.. అనంతగిరి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అటెండర్, స్టాఫ్ నర్స్ సర్వాలక్ష్మి లు ఆమెకు పురుడు పోశారు.. పండంటి మాగ్ బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం ఆమెకు అధికంగా రక్తస్రావం అయింది.. దీనితో వైద్యం అందించటం మానేసిన వైద్య సిబ్బంది మా వల్ల కాదు కిందకు తీసుకుని వెళ్ళండి అని చెప్పారని అప్పటికే ఆమె మృతి చెందింది అని అర్జున్ అన్నారు. వైద్యాధికారులు అందుబాటులో ఉంటే తన భార్య బ్రతికేదాని మృతి కి వైద్య సిబ్బందే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.. ఈ విషయమై అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి లీలప్రసాద్ ను వివరణ కోరగా విచారణ చేపడతామని అన్నారు.

## నగరంలో చెరువుల శుద్ధి

**విజయనగరం వార్తావళి, సెప్టెంబర్ 9:** నగర సుందరీకరణ పక్షోత్సవాలలో భాగంగా చెరువుల శుద్ధి కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ అధికారులు,సిబ్బంది చేపట్టారు. బుధవారం నగరంలో ఉన్న చెరువులలో పూడికను తొలగించడంతో పాటు చెరువు పరిసరాలలో ఉన్న చెత్తాచెదారాలను తొలగించి, పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించారు. అయ్య కోనేరు ప్రాంతంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, ప్రజారోగ్య శాఖ అధికారి డా. ప్రణీత, ఇతర సిబ్బంది చెరువును శుద్ధి చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ గతంలో నగరంలో ఉన్న తొమ్మిది చెరువులను పరిరక్షించి, చుట్టూ ముక్కలను వేసి ఆహ్లాదకర వాతావరణం గా ఏర్పాటు చేశామన్నారు. నగర సుందరీకరణ పక్షోత్సవాల లో భాగంగా చెరువులో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతోపాటు శుద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీని వల్ల చెరువులు మరింత ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా రూపుదిద్దుకొనే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు, పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006